ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 28 | సంచిక : 4 | డిసెంబర్ 2022


## ఈ సంచికలో. . . .


సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 2

గిరి ప్రదక్షిణ ........................................................ 27

నారాయణం పరఃబ్రహ్మం సర్వ కారణ కారణం ........... 30


**ఇతర విషయములు :**


చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం




భగవంతుడి అనుగ్రహం కోసం ఎప్పుడైతే మీరు పని చేస్తున్నారో, ఈ లోకంలో మీ యాత్ర సుఖంగా వెళ్ళిపోతుంది. తరువాత భగవంతుడి అనుగ్రహానికి కూడా మీరు పాత్రులు అవుతారు.


రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-



చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥



పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 05 జనవరి 1988, శృంగవృక్షం

**ఓం నమో భగవతే శ్రీ రమణాయ! ఓం నమో భగవతే శ్రీ రమణాయ!**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా! ఈ రోజున భగవాన్ శ్రీ రమణమహర్షి 108వ జయంతి సందర్భంగా శృంగవృక్షం గ్రామంలో మనం కలుసుకున్నాం. భగవాన్ జన్మదినం అంటే రమణస్వామి శరీరం జన్మించిన రోజు. భగవాన్ 1879వ సంవత్సరంలో డిసెంబరు 30వ తేదీన జన్మించారు. అంటే అంతకుముందు భగవాన్ లేరా? అంటే రమణస్వామి దేహగతమైన చరిత్ర మాత్రమే మనం చెప్పకుంటున్నాం, ఆత్మ చరిత్ర కాదు. భగవాన్ ఏమి చెప్పారు అంటే ఈ శరీరం పుట్టినప్పడు నువ్వు పుట్టావు అని అనుకుంటున్నావు అది అబద్ధం. ఇంకోటిఏమి అనుకుంటున్నాం, ఈ శరీరం మరణించినప్పడు మనం మరణిస్తున్నాం అని అనుకుంటున్నాం. ఇవి రెండు అబద్ధాలు అన్నారు. ఈ మొదలు అబద్ధం, ఈ చివర అబద్ధం. ఎందుచేత? సత్యానికి మొదలు, చివర లేదు. మొదలు ఉంటే తప్పనిసరిగా చివర ఉంటుంది. సత్యానికి మొదలు లేదు, చివర లేదు. శరీరానికి ఉంటుంది మొదలు, చివర. మనం ఏమి అనుకుంటున్నాం? శరీరం మరణించినప్పడు మనం మరణిస్తున్నాం అనుకుంటాం, ఇది పెద్ద అబద్ధం అన్నారు. మరణించేది ఏదో మరణిస్తుంది, ఆ మరణించేది మటుకు నువ్వు కాదు.

ఏవండీ రాబోయే జన్మ నాకు ఎటువంటి జన్మ వస్తుంది అని ఎవరైనా భగవాన్‌ను అడిగేవారు. ఇప్పడు నువ్వు పుడితే రాబోయే పుట్టుక గురించి ఆలోచన చేయటం. అసలు ఇప్పడు నువ్వు పుట్టావా? ఒకవేళ నేను పుట్టాను అనుకుంటే పుట్టింది ఎవరు? దేహం పుట్టింది. దేహం నాది అనుకునేవాడు ఒకడు ఉన్నాడు కదా లోపల, వాడే మంత్రాలు చేస్తున్నాడు, నామాలు చేస్తున్నాడు, యోగాలు అభ్యసిస్తున్నాడు. నీ శరీరం ఇప్పడు పుట్టింది. శరీరం నాది అనేవాడు ఎప్పడు పుట్టాడు? ఈ శరీరం పుట్టినప్పడు నువ్వు పుట్టలేదు. వాడు ఎప్పడు పుట్టాడో అప్పడు నువ్వు పుట్టావు. మీరేమి confusion పెట్టుకోవద్దు.

నిన్న సుబ్బారావు గారి ఇంటిదగ్గర భీమవరంలో నేను మాట్లాడుతుంటే ఎవరో అడిగారు భగవాన్ చెప్పింది అద్వైతమే కదా. ! ఇక భగవాన్ టీచింగ్‌లో ఉన్న విశేషం ఏమిటి అని? భగవాన్ చెప్పింది అద్వైతమే, కాని టెక్నిక్‌లో తేడా ఉంది. ఆ టెక్నిక్ మేము చూపించకపోతే భగవాన్ పేరుకి మేము అన్యాయం చేసిన వాళ్ళం అవుతాము. మీరేదో

రమణనామం చేసుకోవచ్చు. రామనామం చేసుకోవచ్చు మంచిదే, నామం మంచిదే. ప్రీతిగా చేసుకోండి. కాని భగవాన్ భూమి మీదకి ఎందుకు వచ్చారు? ఆ పని కొంతవరకైన నేను explain చెయ్యలేకపోతే ఆయన టీచింగ్‌కు అన్యాయం చేసిన వాడిని అవుతాను. అయితే నామ సిద్ధాంతానికి నేను వ్యతిరేకం కాదు. భక్తికి వ్యతిరేకం కాదు. భగవాన్ ఏమి చెప్పారు అంటే భక్తి లేకపోతే జ్ఞానం రాదు. తల్లి లేకుండా బిడ్డ వస్తుందా? రాదు. అదే విధంగా భక్తి లేకపోతే జ్ఞానం రాదు. పైగా ఆయన ఏమన్నారు అంటే భక్తిని జ్ఞాన మాత అన్నారు. భక్తి జ్ఞానానికి మాత. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటంటే, మీకు నేను అనే తలంపు ఉంది కదా! అది ఎప్పుడు పుట్టిందో నువ్వు అప్పుడు పుట్టావు. అది పుట్టిన తరువాత నీకు దేహాలు వస్తున్నాయి, అది ఉన్నంతకాలం దేహాలు మొయ్యాలి, శవాలు మొయ్యాలి. ఈ శరీరం పోయినప్పుడు నువ్వు పోవు. అది అబద్ధం, నువ్వు మరణించవు. ఈ శరీరం తోటి కలిసి ఉన్న ఈ నేను మరణించిన రోజు నువ్వు మరణిస్తావు. అంతవరకు నువ్వు మరణించవు. మరి చనిపోవటం మాట అబద్ధమా? అబద్ధమే. కలలో చనిపోవటం ఎటువంటిదో ఇప్పుడు చనిపోవటం కూడా అటువంటిదే. ఏమండీ మనం చనిపోయినట్టు మనకి కల వస్తుంది. అది నిజం కాదు కదా! ఇప్పుడు దేహం చనిపోయేది కూడా కలలో చావు లాంటిదే. ఇది నిజం కాదు. ఏది నిజం? ఈ శరీరం తోటి identify అయ్యే నేను ఎప్పుడైతే మరణిస్తుందో అప్పుడే నేను మరణిస్తాను. శరీరం పుట్టినప్పుడు నువ్వు పుట్టలేదు. శరీరం మరణించినప్పుడు నువ్వు మరణించటం లేదు. ఏమండీ, నాది హిందూ మతం, నాది భారత దేశం, మేము రాజులం, మేము బ్రాహ్మణులం, మేము వైశ్యులం అంటున్నారు. ఇందులో ఆత్మ హిందూమతమా? లేకపోతే ఆత్మ రాజులా? ఆత్మ బ్రహ్మణులా? చెప్పండి. భగవంతుడు భగవద్గీతలో మీరు హిందువులు, లేకపోతే క్రైస్తవులు, లేకపోతే భారతీయులు, లేకపోతే అమెరికన్లు ఇవన్నీ చెప్పాడా? లేకపోతే ఆత్మ మీరని చెప్పాడా?

రమణగీత రాసినటువంటి గణపతిశాస్త్రిగారు అంతటి మహాపండితుడు ఒకసారి రమణస్వామి ఎవరో వ్యవసాయదారుడి తోటి ఆత్మ గురించి చెబుతుంటే, వారి ఎదురుగుండా ప్రశ్నిస్తే బాగుండదని ఆ వ్యవసాయదారుడు వెళ్ళిపోయిన తరువాత ఏమండీ స్వామి మీరు చెప్పేది చాలా అన్యాయంగా ఉంది. పూజ చేసుకోండి, నామం చేసుకోండి, ఇలా చెప్పాలి కాని వ్యవసాయదారుడికి ఆత్మ గురించి చెబుతున్నారు ఏమిటి? అని గణపతి శాస్త్రిగారు భగవాన్‌ని అడిగారు. గణపతిశాస్త్రిగారు అంటే మహా పండితుడు, గొప్ప రచయిత, అటువంటి

వాడు వేసిన ప్రశ్న. మీరు ఆ నేను ఎవరు అనేది ఆపు చేయండి. అందరి మీద బాంబు వేసినట్టు ఆ నేను ఎవరు ఏమిటి? అని భగవాన్‌తో అంటే అప్పుడు శాస్త్రిగారు నేను కొన్ని అబద్దాలు చెప్పి ఆఖరున నిజం చెప్పి ఇప్పటివరకు నేను చెప్పినవి అన్నీ అబద్ధాలు. ఇది మటుకు నిజం అని చెప్పమంటారా? అబద్ధాలు చెప్పటం మానేసి నిజం ఒక్కటే చెప్పమంటారా? శాస్త్రిగారు మీరు ఎలా చెయ్యమంటే అలా చేస్తాను అన్నారు భగవాన్. మీరు వెళ్ళి భగవాన్ దగ్గర కూర్చున్నారు అనుకోండి, ముందు మీ మనస్సుని అంతర్ముఖం చెయ్యటానికి చూసేవారు. కారణం ఏమిటి? ఇక్కడ చిన్న రహస్యం ఒకటి ఉంది. మీరు ఏ కులస్తులు అయినప్పటికీ, ఏ మతస్తులు అయినప్పటికీ ఏ దేవుడికి భక్తులు అయినప్పటికీ మనస్సు అంతర్ముఖం కాకపోతే మీకు సుఖం లేదు. మీరు బాహ్యంగా లోకంలో సుఖం లేని చోట సుఖం కోసం వెతుకుతుంటే అక్కడ సుఖం దొరకదు, భ్రాంతి పడుతున్నట్టు లెక్క. సుఖం లేని చోట ఎన్ని జన్మలు వెతికినా, అక్కడ సుఖం దొరకదు. వెతకండి కానీ దొరకదు. ఎందుచేత? అక్కడ లేదు కాబట్టి, మనస్సు అంతర్ముఖం అయితే సుఖం దొరుకుతుంది. మనస్సు బహిర్ముఖం అయితే దొరికేది దుఃఖం.

ఇప్పుడు మాకు సుఖం లేదు, శాంతి లేదు అని చాలామంది అంటున్నారు. ధనవంతులు అంటున్నారు, పేదవాళ్ళు అంటున్నారు. నిరుద్యోగులు అంటున్నారు, ఉద్యోగులు అంటున్నారు, అధికారులు అంటున్నారు, అధికారం లేని వాళ్ళు అంటున్నారు, నాకు శాంతి లేదు, శాంతి లేదు అని అందరూ అంటున్నారు, శాంతి ఎక్కడుంది? మనస్సు అంతర్ముఖం అయినవాడికి శాంతి దొరుకుతుంది కాని మనసు బహిర్ముఖం అయిన వాడికి అశాంతే కాని శాంతి దొరకదు. అందుచేత గురువు చేసే పని, దేవుడు చేసే పని మనస్సుని అంతర్ముఖం చెయ్యటానికే! మనస్సు అంతర్ముఖం అయితేనే శాంతి కనిపిస్తుంది. మీరెన్ని ప్రయత్నాలు చేసినా మనస్సు బహిర్ముఖం అయితే మీకు శాంతి దొరకదు. సర్వసాధారణంగా అందరూ చేసే complaint ఏమిటి? మాకు శాంతి లేదు. శాంతి ఎందుకు లేదు? మీరు బాగా ఆలోచించండి. మనస్సుని బయటకి ఎవరు తీసుకువస్తున్నారు? భగవద్గీత చదువుతున్నాం, భగవద్గీతలో భగవంతుడు నన్ను తెలుసుకోమని చెప్పాడా? గీతని తెలుసుకోమని చెప్పాడా? మీరు బాగా ఆలోచించండి. ఏవండీ గీతలో అది చెప్పాడు కదా, ఇది చెప్పాడు కదా, వేదంలో అది చెప్పాడు కదా, ఇది చెప్పాడు కదా అంటే చెప్పాడు. అసలు పరమార్ధం ఏమిటి? తత్త్వం ఏమిటి? వేదంలో ఇల్లు ఎలా కట్టుకోవాలో చెప్పాడు. పెళ్ళి ఎలా చేయాలో చెప్పాడు. మంత్రాలు ఎలా చదవాలో

చెప్పాడు, వాస్తు శాస్త్రం చెప్పాడు, ఆరోగ్య శాస్త్రం చెప్పాడు. అనేక శాస్త్రాలు చెప్పాడు, నేను కాదు అనటం లేదు. నాలుగు వేదాలు చదివితే సారం ఏమిటి? నిన్ను నువ్వు తెలుసుకో, నాలుగు వేదాలలోను సారం ఇదే. అనేక విషయాలు చెప్పి ఉండవచ్చు. సారం ఇదే, నిన్ను నువ్వు తెలుసుకో! నువ్వు ఎవరవో నీకు తెలియనప్పుడు, నిన్ను జన్మలు వెంటాడతాయి, దుఃఖం వెంటాడుతుంది, విషాదం వెంటాడుతుంది. మీరు నామం చేస్తారు అనుకోండి, తాత్కాలికంగా చాలా బాగుంటుంది. మీరు పూజ చేస్తారు అనుకోండి మంచిదే, ఆ పది నిమిషాలు శాంతిగా ఉంటుంది. మీరు జపం చేస్తారు అనుకోండి మంచిదే, ఆ పది నిముషాలు శాంతిగా ఉంటుంది. మనస్సు అణిగిఉంటే స్వరూపం తెలియదు. అహంకారం అణిగిఉంటే స్వరూపం తెలియదు. మనస్సు నాశనం అయితే, అహంకారం నాశనం అయితే స్వరూపం తెలుస్తుంది. నేను ఎవరినో నాకు తెలిసేవరకు ఆత్మ తోటి, నా హృదయంలో ఉన్న పరమేశ్వరుడి తోటి నాకు వియోగం తప్పదు.

సోదరమహాశయులారా! ఇది అందరూ మీ గుండెల్లో దాచుకోండి. ఈ ఒక్క మాట మీ గుండెల్లో దాచుకోండి. నేను ఎవరినో నాకు తెలియనప్పుడు, నా యొక్క తలంపులకి, ఊహలకి, ఆలోచనలకి మూలం అయినటువంటి మనసు యొక్క మూలం నాకు తెలియనప్పుడు, నా స్వరూపం నాకు తెలియనప్పుడు, చావు లేని, పుట్టుక లేని, ముసలితనం లేని, వికారము లేని ఆత్మ వస్తువు తోటి నాకు వియోగం తప్పదు. ఎంతకాలం అయితే వియోగం ఉందో, అంతకాలం వాడికి దుఃఖం తప్పదు. వాడు ఎంతటి వాడు అయినా సరే, ఎంతకాలం అయితే నీ స్వరూపం తోటి నీకు వియోగం ఉందో, ఎంతకాలం అయితే పరమాత్మ తోటి నీకు వియోగం ఉందో, ఎవరు నీకు సహాయం చేయలేడు. ఏ దేవుడు నీకు సహాయం చేయలేడు. ఏ దేవత నీకు సహాయం చేయలేదు. ఏ పుస్తకం నీకు సహాయం చేయలేదు. నీ స్వరూపం తోటి నీకు ఎంతకాలం అయితే వియోగం ఉందో, ఎంతకాలం ఎడబాటు ఉందో ఎంతకాలం వేరు పడిపోయి ఉన్నారో, అంతకాలం జన్మలు, దుఃఖాలు, బాధలు, భారాలు, మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటాయి. తాత్కాలికంగా నాకు చాలా బాగుంది అనుకోవచ్చు. ఈ చాలా బాగున్నది ఎన్ని రోజులు ఉంటుంది? మా కుటుంబ పరిస్థితులు చాలా బాగున్నాయి, మాకు ఆరోగ్యం చాలా బాగుంది అని మీరు అనుకోవచ్చు. చాలా బాగున్నవి ఎన్ని రోజులు ఉంటాయి? ఈ మనసు యొక్క మూలం తెలియాలి. నేను ఎవరినో నాకు తెలియకుండా, నా స్వరూపం ఏమిటో నాకు తెలియకుండా

నేను దేవుడిని తెలుసుకున్నాను అని అంటే అది నూటికి నూరు పాళ్ళు అసత్యం, ఒక్క విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మీరు పూజించే దేవుడు లేకుండా ఆత్మ ఉండగలదు. దేవుడిని పూజించండి మీరు, నేను పూజించవద్దు అని చెప్పటం లేదు. మీరు పూజించే దేవతలు లేకుండా ఆత్మ ఉండగలదు. కాని ఆత్మ లేకుండా ఏ దేవుడైన ఉన్నాడా లోకంలో? ఆత్మ లేకుండా రాముడు ఉన్నాడా? ఆత్మ లేకుండా కృష్ణుడు ఉన్నాడా? ఆత్మ లేకుండా యేసు ఉన్నాడా? ఆత్మ లేకుండా రామకృష్ణుడు ఉన్నాడా? ఆత్మ లేకుండా రమణుడు ఉన్నాడా? ఆత్మ లేకుండా ఏ దేవుడు ఉండలేడు. కాని దేవుడు లేకుండా, లోకం లేకుండా, జీవుడు లేకుండా, రాగ ద్వేషాలు లేకుండా ఆత్మ ఉండగలదు. అది స్వయంగా ప్రకాశించగలదు. అది ఎక్కడో లేదు. అది దూరాన లేదు. అది మీ హృదయంలోనే ఉంది. ఈ మనస్సును నా వైపుకి తిప్పితే బాగుండును నేను గుంజుకుంటాను అని అది కనిపెట్టుకుని ఉంది. ఆత్మ మిమ్మల్ని ప్రేమించినట్టుగా మీ అమ్మ కాని, మీ నాన్న కాని, మీ మేనమామ కాని, ఎవరు కూడా మిమ్మల్ని ప్రేమించలేరు. ఈ జీవుడు ఎప్పుడు దొరుకుతాడా? వీడిని తరింపచేద్దామా, ఒకసారి నా వంక చూస్తే చాలు. వీడిని లోపలకి గుంజుకుందాం, వీడిని లోపలకి లాగుకుందాం. వీడు ఎవడో వీడికి తెలియ చెబుదాం, వాడు పుట్టిన చోటు నేనే కదా, అని మీకోసం కనిపెట్టుకుని ఎదురు చూస్తున్నాడు పరమాత్మ, ఎక్కడో ఉండి కాదు, మీ హృదయంలో ఉండి చూస్తున్నాడు. ఆయనే డ్రైవరు.

భగవాన్ చెప్పేది ఏమిటి అంటే మీరు అందరూ ఇప్పుడు మోక్షంలోనే ఉన్నారు. కానీ లేరని అనుకుంటున్నారు. మీరు మోక్షంలోనే ఉన్నారు. మోక్షంలో ఉన్నానని తెలుసుకోవటం మీరు చేయవలసిన పని, తెలుసుకోవటం అంటే తెలియబడేది తెలుసుకునేవాడు రెండు అయ్యారు. అది కాదు, ఆత్మను తెలుసుకోవటం అంటే ఆత్మ అవ్వటం. అదే మోక్షం, అదే శాంతి, అదే నిర్వాణం. అది మీ హృదయంలోనే ఉంది. సాక్షాత్తుగా ఉంది. ఇప్పుడు నేను అందరం నేను నేను అంటున్నాం కదా, ఈ నేను అనేది నిజం కాదు, ఇప్పుడు అనే ఈ నేను అనేది తలంపు మాత్రమే. మీరు ఓంకారం అనుకోండి, లేకపోతే రామ అనుకోండి, లేకపోతే శివ అనుకోండి, తలంపు వచ్చిన తరువాత మీరు ఓం అంటున్నారా? తలంపు వచ్చాక మీరు రామా అంటున్నారా? తలంపు వచ్చిన తరువాత కృష్ణా అంటున్నారా? తలంపు రాకుండానే ఇవి అంటున్నారా? అసలు నేను నేను అనేది మొదటి తలంపు, ఆ తలంపు వచ్చిన తరువాతే మిగతా తలంపులు వస్తున్నాయి. ఇది నిజమా? అబద్ధమా? రేపు

తెల్లవారగానే మీరు చూడండి. పొద్దున్నే లేవగానే ఏమని వస్తుంది అంటే ముందు నేను అనే తలంపు వస్తుంది. దాని వెనకాల సైన్యం అంతా వచ్చేస్తుంది. మామూలుగా మీ సంసారం గొడవలు, దేవుళ్ళ గొడవలు, పూజల గొడవలు, జపాల గొడవలు అన్నీ మీవెనకాల ఏ వాసనలు అయితే ఉన్నాయో అన్నీ వస్తాయి. రేపు ఉదయం experiment చేసి చూడండి.

ఈ నేను అనే తలంపు రాకుండా మీకు దేవుడు జ్ఞాపకం వస్తాడా? ఈ నేను అనే తలంపు రాకుండా మీకు దుఃఖం జ్ఞాపకం వస్తుందా? ఈ నేను అనే తలంపు రాకుండా మీకు ఏమైనా బాధ కలుగుతుందా? లేకపోతే నేను అనే తలంపు వచ్చాక మిగతా తలంపులు వస్తున్నాయా? ఈ మొదటి తలంపు, ప్రధమ తలంపు, ప్రధాన తలంపు, ఈ తలంపు ఎక్కడ నుంచి వస్తోంది? ఏవండీ, మీరు అందరూ నేను నేను అని అంటున్నారా, లేదా? ఈ నేను అనే తలంపు మీకు లోపల నుంచి వస్తోందా? బయట భీమవరం నుంచి వస్తోందా? ఎందుకు మీరు డైరెక్ట్‌గా ఫేస్ చేయరు? ఎంతకాలం ఈ నేనుని విడిచి పరుగెడతారు? ఎక్కడకి పరుగెడతారు? మీకు ఏమైనా ఋణం ఉంది అనుకోండి అది తీర్చటం మానేసి కాశీ పారిపోతే ఆ ఋణం తీరిపోతుందా? ఆ ఋణాన్ని పరిష్కారం చేసుకోవాలి. కాని ఋణం తీర్చలేక కాశీ పారిపోతే ఋణం తీరిపోతుందా? ఏమిటి సమస్య? ఈ నేను అనేది నీ సమస్య. నా సమస్య కాదు, దేవుడి సమస్య కాదు. అది నీ సమస్య, నీ సమస్యను పరిష్కరించవా? పరిష్కరించుకోవడానికి నువ్వు ప్రయత్నం చెయ్యవా?

నేను గురించి భగవాన్ అంటున్నారు "జపం చేస్తాను అంటే జపం చేసుకో అని చెబుతుంది. నేను, పూజ చేస్తాను అంటే పూజ చేసుకో అని చెబుతుంది, దేవుడిని స్మరించుకుంటాను అంటే దేవుడిని స్మరించుకో" అంటుందట, నువ్వు మతం కూడా మార్చుకో అవసరం అయితే అని చెపుతుంది. కొంతమంది హిందూ మతం నుండి క్రైస్తవ మతంలోకి, క్రైస్తవ మతం నుండి హిందూ మతంలోకి వస్తారు. నువ్వు మతాలు మార్చుకో, దేవుళ్ళు మార్చుకో, ఊర్లు మార్చుకో, ఎన్ని అయినా మార్చుకో, కానీ నా జోలికి రాకు అని చెపుతుంది. ఎదుటివాడిని చంపమంటే చంపుతారు కానీ మీరు చనిపోవటానికి ఎవరైనా ఒప్పుకుంటారా? ఎవరైనా అంగీకరిస్తారా ఇక్కడ? మీరు చనిపోవటానికి ఎవరు ఒప్పుకోరు. ఈ నేను ఉండాలి, దేవుడిని స్మరించుకోవాలి అంటే నేను ఒప్పుకుంటుంది. దేవుడిని స్మరించటం మానేసి నీ సంగతి ఏమిటో నేను చూస్తాను అంటే అప్పుడు అది తిరగబడుతుంది.

శరీరం చనిపోవటానికి సాధనలు చెయ్యక్కర్లేదు. మామూలుగా ముసలితనం

వస్తుంది, ఏదో ఒక రోజున రాలిపోతుంది. మరి సాధన దేనికి? ఈ సత్సంగాలు దేనికి? ఈ నేను నేను అని పొగరుబోతుతనంగా విజృంభించి, విజృంభించి వస్తున్నటువంటి అహంకారాన్ని తొలగించుకోవటానికే ఇవి అన్నీ. దాని యొక్క source తెలిసే వరకు అది మనలని విడిచి పెట్టదు. పోనీ అహంకారాన్ని తీసుకు వెళ్ళి స్తంభానికి కట్టేసి కొడదాము అంటే దాని రూపము కనపడటం లేదు. అది ఏమి చేస్తుంది? దానికి రూపం లేదు, ఏదో ఒక రూపాన్ని పట్టుకుని అలా ఉంటుంది, ఆ రూపం ముసలిది అయినప్పుడు వదిలేస్తుంది కొత్త రూపాన్ని పట్టుకుంటుంది. అది మటుకు మారదు. చనిపోయిన తరువాత మనం ఏదైనా మారతాము అనుకుంటాం కానీ ఏమీ మారము, సుబ్బారాయుడు సుబ్బారాయుడిలాగే ఉంటాడు. కష్టపడి సాధన చేసుకునేవాడికి ఏమైనా మార్పు వస్తే ఇప్పుడే మార్పు రావాలి కానీ చనిపోయిన తరువాత ఎవడూ మారడు. దీపం ఉండగానే చదువుకోరా అబ్బాయి, చదువుకోరా అబ్బాయి అంటే చదవని పిల్లోడు, దీపం ఆరిపోయిన తరువాత చదువుతాడా? అన్ని అవకాశాలు ఉన్నప్పుడే ఈ నేను గురించి మనం తెలుసుకోలేనప్పుడు మరణించిన తరువాత తెలుసుకుంటామా? ఈ నేను అనేది మన సమస్య. దాని యొక్క source తెలిసేవరకు అది మనలని విడిచి పెట్టదు. దాని పుట్టుక మనకు తెలిసేవరకు, దాని మూలం మనకు తెలిసే వరకు అది విడిచి పెట్టదు.

సోదరమహాశయులారా! ఇవి ఏదో మనం ఊహించి చెప్పుకున్నమాటలు కాదు, ఇది కూడా సైన్సు. మనం రాగ ద్వేషాలు లేకుండా పని చెయ్యగలుగుతున్నామా? మనం ఇష్టం తోటో, అయిష్టం తోటో, స్వార్థం కోసమో పని చేస్తాం. స్వార్థం కోసం పని చేస్తుంటే స్వార్థం పెరుగుతుంది. అహంకారం కోసం పని చేస్తుంటే అహంకారం పెరుగుతుంది. ఇంక అహంకారం ఎలా పోతుంది? స్వార్థం ఎలా పోతుంది? మనం ఉదయం లేచినది మొదలు అహంకారం పెరగటం కోసం పని చేస్తున్నాము, స్వార్థం పెరగటానికి పని చేస్తున్నాము. ఇంక మనకు నిజం ఎలా తెలుస్తుంది? నిజం తెలిస్తేనే కాని మనకు విడుదల లేదు.

కెవికె రాజుగారు ఒక సందర్భంలో ఒక ప్రశ్న అడిగారు. ఏమని అంటే ఏదో పుణ్యం చేయటం, మంచి జన్మలు రావటం, సుఖాలు అనుభవించటం. ఇదేనా గమ్యం? దీనికంటే వేరుగా ఏదైనా ఉందా? అహంకారం తోటి చేస్తే ప్రతి పనికి పుణ్యం అంటుకుంటుంది, లేకపోతే పాపం అంటుకుంటుంది. సోదరమహాశయులారా! మనం చదవటం తేలిక. ఒక చిన్న వాక్యం మీరు practice చేయండి. భగవద్గీతలో అనేక శ్లోకాలు ఉన్నాయి. అందులో

మీకు నచ్చినది చిన్న మాట తీసుకుని మీరు practice చేయండి మీకు నిజం తెలుస్తుంది.

కృష్ణుడు గీతలో "కర్మ ఫలితాన్ని విడిచి పెట్టి నువ్వు పని చెయ్యి" అని చెప్పాడు. కర్మ చేసి ఫలితాన్ని విడిచి పెట్టినవాడే నిజమైన సన్యాసి. కీర్తి కాని, మరొకటి కాని, ఈ లోకానికి సంబంధించినవి కాని, పరలోకానికి సంబంధించినవి కాని, ఏమి ఆశించకుండా కర్మ ఫలితాన్ని విడిచి పెట్టండి. అలా విడిచి పెడితే మీకు అహంకారం నశిస్తుంది, స్వార్థం నశిస్తుంది, అప్పుడు ప్రత్యక్షంగా ఉన్న వస్తువు మీకు దర్శనమిస్తుంది. ఇది ఒక్కటి చేయండి. పని చెయ్యి, దానివల్ల వచ్చే ఫలితాన్ని నువ్వు విడిచిపెట్టు. అలా విడిచి పెట్టటం మొదలు పెడితే వాడి అహంకారం burn అయ్యి తీరుతుంది. అయితే నా అహంకారం పోవటానికి నేను ఒప్పకోను. కారణం ఏమిటి? అది నిజం అనుకుంటున్నాను కాబట్టి, ఎవరు కూడా అహంకారం పోగొట్టుకోడానికి ఇష్టపడరు. కారణం ఏమిటి? అది అబద్ధం అని తెలియటం లేదు, అది నిజం అని అనుకుంటున్నారు. అహంకారం నిజమని ఎప్పడైతే అనుకుంటున్నామో దానికి సంబంధించినటువంటి దేహం, దానికి సంబంధించినటువంటి లోకం, దానికి సంబంధించినటువంటి దేవతలు, అది కల్పించినవి అన్నీ నిజం అనిపిస్తుంది.

దేవుడిని తెలుసుకోవాలి, దేవుడిని తెలుసుకోవాలి అని ప్రతీ వాడు పూజలు చేస్తున్నాడు, ప్రార్ధనలు చేస్తున్నాడు, మంచిదే. దేవుడిని తెలుసుకోవాలి అని సాధన చేస్తున్నారు రైటే, ఆ దేవుడు ఎప్పడైనా మిమ్మల్ని అడిగాడా నన్ను తెలుసుకో అని, ఏవండీ ఎవరిని అయినా అడిగాడా? మీ ఇంటి దగ్గర కూర్చుని ఉండగా మీ రాముడు కాని, మీ కృష్ణుడు కాని, లేకపోతే ఏసుక్రీస్తు కాని నన్ను తెలుసుకోవయ్యా అని అడిగాడా? మీరు ఎవరు దేవుడిని తెలుసుకోరు అనుకోండి ఆయనకు ఏమైనా దుఃఖం వస్తుందా? దుఃఖం వస్తే ఆయన దేవుడు అవుతాడా? ఎవరు మాట్లాడటం లేదు ఏమిటండి? నువ్వు దేవుడిని తెలుసుకోవాలి అని ప్రయత్నం చేస్తావు. దేవుడిని తెలుసుకోవాలి అని అనేవాడు ఎవడు? దేవుడిని తెలుసుకుంటాను అనేవాడిని తెలుసుకో, వీడు తెలియకపోతే వాడు తెలియడు. దేవుడిని తెలుసుకుంటాను అనేవాడు ఇక్కడ ఒకడు ఉన్నాడు కదా, వాడు ఎవడో తెలియనప్పడు నీకు ఆ దేవుడు ఎవరో కూడా నీకు తెలియదు. దేవుడిని తెలుసుకుంటాను అని చెప్పేవాడు ఎవడో నీకు తెలియకపోతే ఆ దేవుడు ఎవరో కూడా నీకు తెలియదు.

మీకు ఎవరికి అయినా దేవుడు కనిపిస్తాడు అనుకోండి మీరు ఎంత సేపు చూస్తారు? ఆయన ఎంతసేపు కూర్చొంటాడు? మీరు వరాలు అడుగుతారు. మీకు ఏమికావాలో అది

ఇచ్చేస్తాడు. మీరు ఎంతకాలం అనుభవిస్తారు? పోనీ అనుభవిస్తారు అనుభవించేది ఎంతసేపు ఉంటుంది? దేహం ఉండగానే సాధించాలి. దేహం అనంతరం నువ్వు ఏదో పొందుతావు అంటే నువ్వు ఏమి పొందలేవు. కొంతమంది రేపు రేపు అని అంటారు. కొంతమంది జపం చేసుకో అంటే రేపు, భగవద్గీత చదువుకో అంటే రేపు, ఆ గోడమీద రాసేసుకుంటే వదిలిపోతుంది ఏ రోజుకారోజే రేపు, ఈ దేహం ఎందుకు వచ్చింది అసలు?

ఈ సృష్టి ఎలా వచ్చింది? ఈ సృష్టి రహస్యం ఏమిటి? మీరు ఒక్కటి జ్ఞాపకం ఉంచుకోండి. ఏ నాటికైనా, ఏ జన్మకైనా ఈ నేను నేను అనేది పుట్టినచోటు మీకు తెలిస్తేనే కాని సృష్టి రహస్యం తెలియదు. సైన్సుకి తెలియదు, ఏ సబ్జెక్టుకి అందదు సృష్టి రహస్యం, ఎవడికి తెలుస్తుంది ఈ సృష్టి రహస్యం? ఈ నేను యొక్క జన్మస్థలం, ఈ నేను అనే ఆ మొదటి తలంపు ఎక్కడైతే ఉదయిస్తుందో తెలిసినవాడికి, ఈ నేను ఎవడో వాడికి అర్థం అయితే సృష్టి యొక్క రహస్యం అర్థం అవుతుంది. భగవాన్ రమణదేవుడు దగ్గర ఒక చిన్న విషయం ఉంది. అతను మనకి సహాయం అందిస్తున్నట్టు మనకి తెలియకుండానే ఆయన అందిస్తాడు. అది రమణుడు యొక్క వైభవం. రమణుడులో ఉన్న ఆత్మ మనలో లేదా? అయితే రమణజయంతి ఇక్కడ ఎందుకు చేసుకోవాలి? అంటే ఆ దేహం ద్వారా ఆత్మ యొక్క వైభవం వ్యక్తం అయ్యింది కాబట్టి. ఆత్మ ఎవడికి తెలుస్తుంది? నాకు తెలియదు, మీకు తెలియదు. ఎవడికి తెలుస్తుంది? ఆత్మజ్ఞానం కోసం ఎవడైతే తన జీవితాన్ని అంకితం చేశాడో వాడికి తెలుస్తుంది. మొత్తం మనస్సుకున్న శక్తిని అంతా కూడా, ఉన్న మానసిక శక్తినిఅంతటిని కేంద్రీకరించి, కేవలం ఆత్మాన్వేషణ కోసం, ఆత్మ కోసం, ఆత్మ జ్ఞానం కోసం ఎవడైతే తన జీవితాన్ని అంకితం చేశాడో వాడికి మటుకే ఆత్మ తెలియబడుతుంది. అలా తెలియబడిన వాళ్లలో రమణమహర్షి ఒకడు. అలా మన జీవితాన్ని మనం ఎవరిమైన అంకితం చేసుకున్నామా? మన ఇంటిలో కష్టాలు ఉండి దేవుడిని ప్రార్థించుకుంటున్నాం, ఇంకా కాస్త మంచి జన్మ రావాలని, కడుపు నొప్పి వస్తే కడుపు నొప్పి తగ్గాలని దేవుడిని ప్రార్థించుకుంటున్నాం, భౌతికమైన కారణాల వల్లే మనం దేవుడిని ప్రార్థించుకుంటున్నాం. సోదరమహాశయులారా! మనకి భక్తి ఉంది, ఈ భక్తిలో అసలు ఏముంది? భౌతికవాసనలు, భౌతికవాంఛలు, భౌతికకోరికలు, అంతా ఈ లోకానికి సంబంధించినదే. భక్తి ఎవడికి కావాలి? పరమాత్మ ఎవడికి కావాలి? ఎవడు తన జీవితాన్ని అంకితం చేస్తాడండి పరమాత్మ కోసం? అది ఏమిటో తెలియకుండా దానికోసం వీడు జీవితాన్ని ఎలా అర్పిస్తాడు? రామాయణం చదువుతున్నారు, బాగానే ఉంది. రాముడు

చాలా గొప్పవాడు, మీకు కలిసి వచ్చేది ఏమిటి? రమణమహర్షి జ్ఞాని, చాలా గొప్పవాడు. అయితే మీకు కలిసి వచ్చేది ఏమిటి? భీమవరం స్టేట్ బ్యాంకులో కొన్ని కోట్ల రూపాయలు ఉన్నాయి. మీ జేబులో పైసా లేదు. ఏమిటి మీకు కలిసివచ్చేది? భీమవరం స్టేట్ బ్యాంకులో డబ్బు ఉందని, అది స్మరిస్తూ కూర్చోవటమేనా, మనం ఏదైనా నాలుగు రూపాయలు సంపాదించుకుని బ్రతకాలా? రాముడు గొప్పవాడు , కృష్ణుడు గొప్పవాడు, రమణమహర్షి గొప్పవాడు అయితే మన మాట ఏమిటి? కనీసం మన గమ్యం ఏమిటి? రాముడిని చూడటమేనా మీ గమ్యం? లేకపోతే కృష్ణుడిని చూడటమేనా మీ గమ్యం? ఏదో ఒక మతంలో చేరటమేనా మీ గమ్యం? లేకపోతే ఆచారాలు, ప్రచారాలేనా మీ గమ్యం? ఏమిటి జీవిత గమ్యం? సత్యమైన పరమాత్మ మన హృదయంలో ఉన్నాడు, బ్రహ్మమే నాలో ఆత్మగా ఉంది. ఈ ఆత్మ వేరు, దేవుడు వేరు కాదు. ఈ ఆత్మ వేరు, నేను వేరు కాదు. ఆత్మను తెలుసుకునే వరకు మనం ఈ చీకట్లో ఉండాల్సిందే. అది ఇక్కడే ఉంది, ఇప్పుడే ఉంది. మీలో సిద్ధముగా ఉంది. అది ఎప్పుడూ ఉంది, నువ్వు పుట్టకముందు ఉంది. ఇప్పుడూ ఉంది, నువ్వు మరణించిన తరువాత ఉంటుంది. మీ శరీరానికి, దానికి అణుమాత్రము కూడా సంబంధం లేదు అన్నాడు రమణస్వామి. అది నువ్వు అయ్యి ఉన్నావు. దానిని తెలుసుకునే వరకు నీకు ఈ దుఃఖము తప్పదు, అశాంతి తప్పదు.

ఇంటిలో కష్టాలు పడలేక ఒక ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకుందాం అని భగవాన్ దగ్గరకు వచ్చాడు. ఎండ్రిన్ తాగి చనిపోదాం అని నిర్ణయించుకున్నాడు. భగవాన్ అనేవారు తప్పు చేసేది అహంకారం, శిక్షించేది ఈ శరీరాన్ని, తప్పేమో అహంకారం చేస్తుంది , ఎండ్రిన్ తాగి చనిపోయేది ఈ శరీరం పాపం, వాడు తీరా వచ్చి కూర్చున్నాడు. ఎండ్రిన్ డబ్బా కొనుక్కున్నాడు. ఇవన్నీ నిజమే సుమా, పదిమందిలో చనిపోతాను అని ఎవడు చెబుతాడు? పైగా ఎండ్రిన్ తాగి చనిపోతాను అని ఎవడు చెబుతాడు? భగవాన్ ఏమి చేస్తున్నారు, ఒక కుట్టుడాకు కుట్టుకుంటున్నారు. ఆ ఉపాధ్యాయుడు భగవాన్‌తో నేను చనిపోతాను నేను బాధలు పడలేకపోతున్నాను అని చెబుదాం అని వచ్చాడు పాపం, ఒక్కసారి కనిపించి కడసారి దర్శనం చేసుకుని ఇంటికి వెళ్ళిన తరువాత ఎండ్రిన్ తాగుదాం అని, భగవాన్ ఎక్కడ ఉన్నారు? వాడి హృదయంలో లేడా? వాడు ఏమి తాగబోతున్నాడు అని భగవాన్‌కి తెలియదా? మనకి ఏ తలంపు వస్తుందో ఆ తలంపు రాకముందే మన లోపల ఉన్న ఈశ్వరుడికి తెలుసు. మనకు తలంపు వచ్చిన తరువాత తెలుస్తుంది అది ఏ తలంపో, కాని

మనకి రాకముందు కూడా అక్కడ ఏముందో ఈశ్వరుడికి తెలుసు వాడు ఈశ్వరుడు అంటే. మనకు దేవుడు కావాలి, శాంతి కావాలి, సుఖం కావాలి, సంతోషం కావాలి, వైకుంఠం కావాలి, అన్నీ కావాలి కానీ బుద్ధి మటుకు వంకర బుద్ధి. మనకు సద్బుద్ది లేదు. సద్బుద్ధి లేనివాడికి సిద్ధముగా ఉన్న వస్తువు తెలియదు. ఆ సిద్ధంగా ఉన్న వస్తువును తెలుసుకున్న వాడు సిద్ధ పురుషుడు. దేవుడిని చూసినవాడు సిద్ధ పురుషుడు కాదు. దేవుడి శరీరం నిజం కాదు, శరీరం ధరించి రావచ్చును. ఆత్మ మాట్లాడదు, ఆత్మ మాట్లాడటానికి శరీరం అవసరం. అదే అవతారం అంటారు. ఆ శరీరం తోటి మాట్లాడుతుంది, పని చేస్తుంది, వెళ్ళిపోతుంది అది. తాత్కాలికంగా అవసరం కోసం ఆ శరీరం ధరించింది అక్కడ. ఆత్మ మన హృదయంలోనే ఉంది, దానిని మనం తెలుసుకోవాలి అనే కోరిక ఉంది. కాని మనకి సద్బుద్ధి లేదు. సద్బుద్ధిని సాధించండి. సద్బుద్ధిని సాధిస్తే మీకు సిద్ధంగా ఉన్న వస్తువు వ్యక్తం అవుతుంది. అప్పడు మీరు సిద్ధపురుషులు అవుతారు. ఆ సిద్ధంగా ఉన్న వస్తువును ఎవరైతే సిద్ధింపచేసుకున్నారో, వాడికి దేవుడు వచ్చి ఎదురుగా కనిపిస్తే ఇలా మొఖం పైకి ఎత్తి చూడాలని కూడా అనిపించదు. ఆ వస్తువు యొక్క వైభవం అటువంటిది.

ఆ వస్తువు ఎక్కడ ఉంది? మీ హృదయంలో ఉంది. ఈ లోపల, బయట ఏమిటి? అది లోపలే కాని బయట లేదా అంటే అంతటా ఉంది. మరి కృష్ణుడు మీ లోపల ఉంది అని ఎందుకు చెప్పాడు? లోపల ఉండి బయట లేకపోతే అది నిజం అవుతుందా? మరి లోపల ఉంది అని ఎందుకు చెప్పాడు? మన అందరికి దేహాత్మబుద్ధి ఉంది. దేహమే నిజం అనుకుంటున్నాం. ఈ దేహం నాది అనుకుంటున్నాం, ఈ దేహం బయట లోకం మనకి కనిపిస్తోంది. మీకు దేహాత్మ భావన ఉన్నంతకాలం, దేహమే నిజం అనుకునే బుద్ధి ఉన్నంతకాలం, లోపల, బయట భావన తగ్గదు. మీ హృదయంలో ఉన్న ఆత్మ మీకు తెలిస్తే అది నిజం, అంతటా ఉన్నది అదే! ఏదో కేంద్రం చూపించాలి కాబట్టి లోపల వెతుకు అన్నాడు కృష్ణుడు. అంతేకాని బయట లేదు అని కాదు. దేహాత్మ బుద్ధి ఉన్నవాడికి నేను

**సత్యం అనేది నీ బుద్ధితో అర్థం చేసుకునేది కాదు. నీ బుద్ధి ఎక్కడైతే లయమయిందో, నీ మనస్సు ఎక్కడైతే లయమయిందో అక్కడ సత్యం నీకు వ్యక్తమవుతుంది.**



లోపల ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది, ఎక్కడో దూరాన దేవుడు ఉన్నాడు, ఈ భావాలు మనకు తప్పవు.

మీరు చేసే తప్పు, నేను చేసే తప్పు, మనమందరం చేసే తప్పు ఒక్కటే, అహంకారం నిజం అనుకుంటున్నాం. అందుచేత అందులోంచి వచ్చే కోరికను satisfy చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాం. మీకు భక్తి లేదా? మీకు భక్తి ఉంది. రమణమహర్షికి భక్తి ఉంది, మనకి భక్తి ఉంది. అయితే ఆయనకి, మనకి తేడా ఏముంది? ఆయన అరుణాచల శివ అరుణాచల శివ అన్నాడు. మనం అరుణాచల శివ, అరుణాచల శివ అంటున్నాం, ఆ భక్తికి, ఈ భక్తికి తేడా ఏమిటి? అక్కడ కోరికలు లేవు, అందుకు దేవుడు అయ్యాడు. మనకి కోరికలు ఉన్నాయి అందుకు మనం జీవులం అయ్యాము. మీరు కూడా దేవుడు అవుతారు, మీరు కూడా రమణమహర్షి అంతటి వాళ్ళు అవుతారు, అందులో సందేహం లేదు. కోరిక ఉంటే అవ్వలేరు. ఏవండీ కోరిక లేకపోతే మా పనులు ఎలా అవుతాయి? మీరు పని చేసుకుంటే కోరిక తోటి సంబంధం లేకుండా పనులు అవుతాయి. పనికి, కోరికకి సంబంధం లేదు. కోరిక లేకపోయినా పని అవుతుంది. శక్తి ఈశ్వరుడిది. కోరికకు శక్తి లేదు. ఒక్కొక్కసారి మనం కోరినా పని అవ్వదు. ఒక్కొక్కసారి మనం అడగకుండానే పని అవుతుంది. అది ఎవరు చేసి పెట్టారు? ఈశ్వరుడు చేసి పెట్టాడు. అది ఈశ్వరుడు యొక్క ప్రణాళికలో ఉంది. అయితే మనం ఏమి అనుకుంటున్నాం, మన కోరిక లేకపోతే అవ్వదు అని, కోరికకి శక్తి ఉందా? పని చెయ్యటానికే నువ్వు పనికి వస్తావు. ఫలితం నీ చేతిలో లేదు. ఫలితం పరమేశ్వరుడి చేతిలో ఉంది. భగవాన్ ఏమంటున్నారు అంటే నీ భార్య, నీ పిల్లలు, నీ భర్త, నీ మేనమామలు, వాళ్ళు సంసారం కాదు. మనుషులు సంసారం కాదు, రూపాయలు సంసారం కాదు, పొలాలు సంసారం కాదు, మీకు బాహ్యంగా ఉన్న పుస్తకాలు సంసారం కాదు, నువ్వు అనుకునేది ఏది సంసారం కాదు. మీ అహంకారమే సంసారం. ఈ అహంకారం అనే సమస్యని పరిష్కరించనంత కాలం ఏమి ప్రయోజనం లేదు. ఒకటి లేని సున్న. ఈ అహంకారాన్ని తొలగించుకోలేకపోతే జీవితంలో ఎన్ని attain చేసినా కూడా అవి ఒకటి లేని సున్నలే.

అహంకారం అనే సమస్యను పరిష్కరించుకోకుండా ఎక్కడికి వెళతావు? హిమాలయ పర్వతాలకిపారిపోతావా? పోనీ హిమాలయపర్వతాలకి పారిపోతే శృంగవృక్షం దూరం అవుతుంది, ఇక్కడ పరిసరాలు దూరం అవుతాయి. మీ అహంకారం మీ కూడా రాదా? లేకపోతే అమెరికా పారిపోండి, అమెరికా పారిపోతే మీ అహంకారం మీ కూడా

రాదా? లేకపోతే ఎండ్రిన్ తాగి చనిపోండి. దేహం పోయినా, ఎన్ని పోయినా, నీ అహంకారం నీ కూడానే వస్తుంది. అందుచేత ఏది సంసారం? మనుషులు సంసారం కాదు. అహంకారమే సంసారం, ఆ సంసారం ఎలా వస్తుంది? మీరు ఆలోచించండి. అది తెలుసుకుందాం, ఇది తెలుసుకుందాం, అది పొందాం, ఇది పొందాం, అది సంపాదించాం, ఇది సంపాదించాం, ఎన్నో తెలుసుకున్నాం, నాకు అన్నీ తెలుసు, అన్నీ తెలుసుకునే వాడు ఒకడు ఉన్నాడు. వాడు ఎవడు? వాడిని తెలుసుకో, అది రమణస్వామి సందేశం. అసలు మీకు తెలియని విషయాలు ఏమున్నాయి? శృంగవృక్షంలో ఏమి జరుగుతోంది అంటే అన్నీ చెప్పేస్తారు. అన్నీ తెలుసుకున్న వాడు వీడు నిజమా? అబద్ధమా? పోనీ తెలుసుకున్నావు, రైటే. ఈ తెలుసుకునే వాడిని ఎందుకు తెలుసుకోవు? పిల్లలు ఎప్పుడైనా తగువు పడుతుంటే తల్లులు ఏమి చేస్తారు? బొమ్మలు అక్కడ పడేస్తారు, పిల్లలు ఆ బొమ్మల తోటి పడి ఉంటారు. అలాగే అహంకారం ఏమి చేస్తుంది అంటే దాని మూలాన్ని మనం వెతుకుతాం అని, అది ఏదో ఒక పని చెబుతూ ఉంటుంది మనకి, అది తెలుసుకో, ఇది తెలుసుకో, ఏదో ఒకటి తెలుసుకోమని చెబుతుంది. ఎందుకంటే దానిని చంపుకోవటానికి అది ఇష్టపడదు. నేను చంపుకోవడానికి నేను ఇష్టపడతానా? మీరు చంపుకోవడానికి మీరు ఇష్టపడతారా?

ఈ దేహం వచ్చింది, ఆ దేహానికో పేరు పెట్టారు. ఆ పేరన్నా, ఈ దేహం అన్నా మనకి ఇష్టం. మనకి పుట్టినప్పుడు పేరు లేదు, ఈ శరీరం బయటకి వచ్చాక ఈ శరీరానికి వ్యవహారం కోసం ఒక పేరు పెట్టారు. ఆ పేరు కోసం అవసరం అయితే ఆస్తులు ఇస్తాం, బిల్డింగులు ఇస్తాం ఎన్నో చేస్తాం, కాని నిజం కోసం మటుకు మనం త్యాగం చెయ్యము. గాంధీగారికి ఒకసారి పది లక్షల రూపాయలు ఒకడు చందా ఇచ్చి గాంధీగారితో మీరు సంతోషించారు కదా అన్నాడు, మద్రాసులో జరిగిన సంఘటన ఇది. అంటే అప్పుడు గాంధీగారు "నేను సంతోషిస్తాను ఎప్పుడు? గాంధీగారికి నేను పదిలక్షలు ఇచ్చాను అని అనుకునేవాడు ఒకడు నీలో ఉన్నాడు కదా, వాడిని కూడా ఇచ్చేస్తే నేను సంతోషిస్తాను" అని చెప్పారు. వాడిని ఎవడు ఇస్తాడు? వాడి యొక్క పొంగు కోసం, వాడి యొక్క గొప్ప కోసం, ఇన్ని రూపాయలు ఇస్తే, వాడిని ఎవడు ఇస్తాడు? మనం చనిపోయేవరకు చేసేది ఏమిటి అంటే నిజాన్ని తెలుసుకోవటం కాదు మన అహంకారానికి పాలేరుతనం చేస్తున్నాము. మనం దేవుడికి నౌకరులం కాదు, ఆత్మకి నౌకరులం కాదు. మన అహంకారానికి నౌకరులం. ఎందుచేత? అది నిజం అనుకుంటున్నాం కాబట్టి!

ఈ రాగ ద్వేషాల తోటే ప్రతీ మనిషి పని చేస్తాడు. రాగ ద్వేషాల తోటి పని చేసినంత కాలం వాడికి పుణ్యం వస్తుంది, పాపం వస్తుంది. పుణ్యం, పాపం వచ్చినంత కాలం దానిని బట్టి మనకి జన్మ వస్తుంది. జన్మ వచ్చిన తరువాత మళ్ళీ వాడు పని చేస్తాడు. పని చేస్తే పుణ్యం వస్తుంది, పాపం వస్తుంది. దానిని బట్టి మళ్ళీ ఇంకొక శరీరం వస్తుంది. మళ్ళీ శరీరం వచ్చిన తరువాత పని చేస్తాడు. ఆ పని చేసేటప్పుడు రాగ ద్వేషాల తోటి చేస్తాడు. స్వార్థం తోటి చేస్తాడు, అహంకారం తోటి చేస్తాడు, మళ్ళీ కర్మ చుట్టుకుంటుంది. కర్మ బట్టి మళ్ళీ శరీరం వస్తుంది. అంటే రాగ ద్వేషాలు లేకుండా ఎవడైనా పని చేస్తున్నాడా ఇక్కడ? రాగ ద్వేషాలు లేకుండా ఎవడు చేయగలడు అంటే నిజం తెలిసినవాడు చేయగలడు. జన్మచక్రం లోంచి, సంసారచక్రం లోంచి బయట పడాలి అంటే వాడికి నిజం తెలియాలి. నిజం ఎప్పుడైతేతెలుస్తుందో వాడి రాగ ద్వేషాలు పోతాయి. రాగ ద్వేషాలు లేకుండా చేసే కర్మ వాడిని అంటదు. జ్ఞాని కర్మ చేస్తాడు, పుణ్యం వాడిని అంటదు, పాపం వాడిని అంటదు. ఫలితం వాడికి అంటదు, ఎందుచేత? వాడికి నిజం తెలుసు కాబట్టి. సరే మాష్టారు భగవాన్ దగ్గరకు వచ్చాడు, ఎండ్రిన్ తాగడానికి సిద్ధంగా ఉన్నాడు, కానీ చెప్పటానికి సిగ్గేస్తోంది. అప్పడు భగవాన్ కుట్టుడాకు కుట్టుకుంటున్నారు. ఏవండీ మాష్టారు నేను ఈ కుట్టుడాకు ఎందుకు కుట్టుకుంటున్నాను? మాష్టారు అన్నారు మీరు భోజనం చేయడానికి ఈ ఆకు కుట్టుకుంటున్నారు. అప్పడు భగవాన్ అన్నారు నేను భోజనం చెయ్యడానికి ఈ ఆకు కుట్టుకుంటున్నాను. భోజనం చేయకుండా ఈ ఆకు బయట పడేస్తాను అనుకోండి, అప్పడు ఏమి చేయాలి అని అడిగారు. అప్పడు ఈ పంతులుగారు అన్నారు ఇంకొక ఆకు కుట్టుకోవాలి అన్నారు. అర్థమయ్యింది స్వామి, ఏమని అర్థం అయ్యింది అంటే నాకు జ్ఞానం కలగలేదు. జ్ఞానం కలగకుండా ఈ శరీరం పడిపోతే ఇంకొక శరీరం వస్తుంది. భోజనం చేయకుండా ఆకు పడేస్తే ఇంకొక ఆకు కుట్టుకోవాలి, అన్నం తిన్నాక పడేస్తాను అనుకో అప్పుడు ఇంకొక ఆకు అక్కర్లేదు. అదే విధంగా నీకు జ్ఞానం కలిగిన తరువాత శరీరం ఉన్నా ఒక్కటే, ఊడిపోయినా ఒక్కటే!తాగుబోతువాడికి ఒంటిమీద బట్ట ఉంటుందో లేదో తెలియదు, అదే విధంగా జ్ఞానికి కూడా తనకి శరీరం ఉందో లేదో తెలియదు. నాకు ఒక శరీరం ఉంది అని, ఆ శరీరానికి రెండు చేతులు ఉన్నాయి అని, ఆ చేతి మీద కురుపు వేసింది అని, మీరు చెబుతుంటే నాకు తెలుస్తోంది అన్నారు భగవాన్. భగవాన్ పెద్ద దొంగ.

మేము జపం చేసుకుంటున్నాం అంటే భగవాన్ సరి సరి అన్నారు. అంటే జపం

వద్దు అని కాదు కానీ అది ఆయన సిద్ధాంతం కాదు. ఇంకొక పెద్ద మనిషి ఏమి అడిగాడు. రాముడికి జ్ఞానం ఉందా? అని. అప్పుడు భగవాన్ అన్నారు ఏ రాముడిని స్మరిస్తే, ఏ కృష్ణుడిని స్మరిస్తే మనకు జ్ఞానం కలుగుతుందో, వాళ్ళు జ్ఞానం లేకుండా ఉన్నారా? అన్నారు. నేను జపం చేసుకుంటున్నాను అంటే భగవాన్ ఏమన్నారు? జపం చేసుకో, జపం చేసే జపి ఎవరు? సోదరమహాశయులారా! ఇది మీరు ఆలోచించండి. చేతులు ఉన్నాయి - పని చేస్తున్నాం, కాళ్ళు ఉన్నాయి - నడుస్తున్నాం, నోరు ఉంది - తింటున్నాం, అదే విధంగా భగవంతుడు మనకి బుద్ధిని కూడా ఇచ్చాడు. ఎందుకు ఇచ్చాడు? దానితో ఆలోచించాలి. మీరు జపం చేస్తున్నారు రైటే జపం చేసే జపి ఎవరు? జపం చేస్తే మనసు అణుగుతుంది జపం చేసే జపి ఎవరని విచారణ చేస్తే అది నాశనం అవుతుంది. అణగటం వేరు, నాశనం అవ్వటం వేరు. అణిగిన మనస్సు ఎప్పుడైనా విజృంభించవచ్చు, మీరు ఎప్పుడైనా పడుకున్న పాము మీద ఒక బెడ్డ వేయండి, పెద్ద పడగ విప్పుతుంది. చనిపోయిన పాము మీద బెడ్డ వేయండి అది ఏమి చేయదు. అదే విధంగా నీ మనసు అణిగి ఉంటే, నీ అహంకారం అణిగి ఉంటే, అది ఇంకొక రోజున అయినా, ఇంకొక జన్మలో అయినా అది విజృంభించే ప్రమాదం ఉంది. అది ఎక్కడ నుండి వచ్చిందో దాని మూలం తెలిస్తేనే కాని అది నాశనం అవ్వదు. జపం చేస్తున్నావు రైటే, చెయ్యి జపం చేస్తే మనసు అణిగి ఉంటుంది. ఈ జపం చేసేవాడు ఎవడుఅని విచారణ చెయ్యి, వాడి మూలాన్ని కనుక్కో, వాడి మూలాన్ని కనుక్కునే వరకు వాడి సమస్య పరిష్కారం కాదు.

అనేక సమస్యలను మీరు పరిష్కారం చేస్తున్నారు. ఈ అహంకారం అనే సమస్యను మీరు పరిష్కారం చెయ్యరా? దీనికోసం కొంత కాలాన్ని ఇవ్వరా? మీరు ఎన్నో సమస్యలు పరిష్కారం చేస్తున్నారు, మీ ఇంట్లో ఎన్నో పేచీలు వస్తున్నాయి, ఆ పేచీలు మీరు పరిష్కారం చెయ్యగలుగుతున్నారు చాలా పేచీలు, కాని ఈ అహంకారం అనేది కూడా ఒక సమస్యే, ఇది కూడా ఒక problem. దాని నుండి ఎందుకు మీరు తప్పించుకుని తిరుగుతున్నారు? ఈ సమస్యను మీరు పరిష్కరించటానికి ప్రయత్నం చెయ్యరా? ఆయన వైకుంఠం గురించి మాట్లాడటం లేదు. కైలాసం గురించి మాట్లాడటం లేదు. మీ సమస్య గురించి immediate గా మీకు ఉన్న problem గురించి మాట్లాడుతున్నాడు. మీకు problems అనేకం ఉన్నాయి. కాని problemకి problem అయినటువంటి, సమస్యలకు సమస్య అయినటువంటి, ఈ అహంకారం గురించి మీరు ఆలోచించరా? ఈ అహంకారం అనే సమస్యను మీరు

పరిష్కారం చేసుకోరా? అని మీ గురించి అడుగుతున్నాడు శ్రీ రమణమహర్షి.

మాకు చాలా దుఃఖంగా ఉందండి. మాకు చాలా బాధగా ఉందండి. మీరు దేవుడి గొడవ చెప్పమంటే ఏదో చెబుతున్నారు. రాముడు అయోధ్యను పరిపాలిస్తే ఏముంది? కృష్ణుడు ద్వారకను పరిపాలిస్తే ఏముంది? గాంధీగారు స్వరాజ్యం తీసుకొస్తే మాకు ఏమిటి? మాకు ఎన్నో సంపదలు ఉన్నాయి కాని మాకు దుఃఖం వస్తోంది. ఈ దుఃఖానికి దూరం కావటం ఎలాగ? ఈ దుఃఖం నన్ను పిండేస్తోంది, నాకు రక్త పోటు తీసుకువస్తోంది. అనేక సమస్యలను తీసుకు వస్తుంది. నేను దుఃఖాన్ని భరించలేకపోతున్నాను. ఈ దుఃఖం నుండి ఎలా విడుదలపొందటం అంటున్నాడు. నీకు దుఃఖం వస్తోంది, నువ్వు బాధ పడుతున్నావు, నువ్వు కష్టం పడుతున్నావు. ఈ దుఃఖం ఎలా వస్తోంది? ఈ కష్టం ఎలా వస్తోంది? ఈ సమస్యను నువ్వు పరిష్కారం చేసుకో ముందు, నేను తర్వాత నువ్వు వచ్చావు, నేను తర్వాత వాడు వచ్చాడు. నువ్వు లేకుండా దేవుడు ఉన్నాడా? నువ్వు లేకుండా లోకం ఉందా? నువ్వు లేకుండా బంధువులు ఉన్నారా? నువ్వు లేకుండా స్నేహితులు ఉన్నారా? నువ్వు లేకుండా విరోధులు ఉన్నారా? నువ్వు వచ్చిన తరువాత ఇవన్నీ వచ్చాయి. ఆ నేను ఎవరు? ఆ నేనులో ఉంది దుఃఖం అంతా, ఆ నేను అబద్ధం కాబట్టి దుఃఖాన్ని తీసుకు వస్తుంది. నాకు దుఃఖం ఉంది, నాకు దుఃఖం ఉంది అంటున్నావు మీ దుఃఖాన్ని చేతిలో పెట్టి ఇలా చూపించండి. మీరు ఎవరైనా దుఃఖ పడుతుంటే మీ దుఃఖాన్ని చేతిలో పెట్టి ఇలా చూపించండి. దుఃఖం అనేది ఒక వస్తువా? ఒక పదార్థమా? దుఃఖం కూడా ఒక తలంపే, బాధ కూడా ఒక తలంపే. సోదరమహాశయులారా! అక్కడ దాకా ఎందుకు? శరీరము కూడా ఒక తలంపే.

సుబ్బారావు గారి తండ్రి అడిగారు భీమవరంలో ఏవండీ రమణమహర్షి చాలా గొప్పవాడు అంటున్నారు కదా, నిజమే, మహాత్ముడే, ఆయనకి cancer లాంటి పెద్ద రోగం ఎందుకు వచ్చింది? భగవాన్ అన్నారు శరీరం ఒక రోగం, రోగానికి రోగం రావటంలో ఆశ్చర్యం ఏముంది? శరీరం కూడా ఒక తలంపే. నేను శరీరాన్ని, నేను సీతమ్మని, నేను పుల్లమ్మని, మేమురాజులం, మేము బ్రాహ్మణులం, నేను భీమవరంలో ఉన్నాను, నేను పాలకొల్లులో ఉన్నాను. మేము హిందువులం, మేము క్రైస్తవులం అని మీకు తలంపు వచ్చాక తెలుస్తోందా? తలంపు రాకముందే తెలుస్తోందా? మాట్లాడరేమిటండి ఎవరైనా? ఇది సైన్సు. గాఢనిద్రలో ఉన్నప్పుడు మీ శరీరం గొడవ మీకు ఏమైనా ఉందా? నిద్రలో మీ

రక్తపోటు గొడవ కాని, మీ తలకాయ పోటు గొడవ కాని, మీ కడుపు నొప్పి బాధ కాని ఎవరికైనా ఏదైనా ఉందా? అసలు మీ శరీరం గొడవ మీకు ఏమైనా ఉందా? లేదు. మీకు తలంపులు వచ్చిన తరువాత శరీరం గొడవ వస్తోంది. అంటే శరీరం కూడా ఒక తలంపే, తలంపు లేనప్పుడు శరీరం కూడా లేదు. ఇదంతా నిజమా? అబద్ధమా?

నేను ఏదైనా మాటలు మీకు చెబుతున్నాను అనుకోండి, మీలో కొంతమందికి సంతోషం వస్తుంది అనుకోండి అది నేను చెప్పటం వల్ల వస్తుందా? కాదు. మిమ్మల్ని సంతోషపడమని నేను చెబుతున్నానా? ఏమీ లేదు, ఇందులో రహస్యం ఏమిటి అంటే మీ మనస్సు అంతర్ముఖం అయితే ఆ లోపల ఉన్న సుఖాన్ని మీరు అనుభవిస్తారు. అప్పడు మీకు సంతోషం కలుగుతుంది. మనస్సు అంతర్ముఖం అయినపుడు మీ లోపల హృదయంలో సుఖమే ఉంది. అక్కడ దుఃఖం లేదు. మీ హృదయంలో వైకుంఠం ఉంది. స్వర్గ రాజ్యం మీలోనే ఉంది. మీ మనస్సు ఎప్పడైతే అంతర్ముఖం అయ్యిందో అప్పడు మీ మనస్సు హృదయం వైపుకి తిరుగుతుంది. అప్పడు హృదయంలో ఉన్న సుఖాన్ని తెలుసుకుంటారు. నేను చెప్పటం లేదు, మీకు సుఖం రావటంలేదు. నేను చెప్పటం వల్ల నీ మనస్సు అంతర్ముఖం అయితే, నీ హృదయంలో ఉన్న సుఖాన్ని మనస్సు అందుకుంటుంది. అబ్బా ఎంత సుఖంగా ఉంది అనుకుంటారు. ఆ సుఖం మీదే, నేను ఇచ్చింది కాదు. ఏ రకంగా మీరు సుఖాన్ని పొందినా కూడా అది లోపల నుంచే వస్తుంది.

ఒకసారి భగవాన్‌ని ఒక ఇంజనీరుగారు "ఏవండీ గిరి ప్రదక్షిణ చేయమంటున్నారు, ఈ కొండ చుట్టూ, ఈ రాళ్ల చుట్టూ ప్రదక్షిణ చేయమంటున్నారు. ఏమిటండి? కొండ దేవుడా? ఈ రాళ్ళు దేవుడా?" అని అడిగారు. భగవాన్ ఏమన్నారు అంటే "ఈ శరీరం నువ్వు అనుకుంటున్నావా, లేదా? నేను అనుకుంటున్నావు. ఈ మాంసం, ఎముకలు నువ్వా? ఈ శరీరం నువ్వు అనుకుంటే తప్పు లేదు, ఆ కొండ దేవుడు అనుకుంటే మటుకు నీకు తప్పు వస్తోంది. ఈ శరీరం నువ్వు అనేది ఎంత నిజమో, ఆ కొండ దేవుడు అన్న మాట



**అహంకారమును కేంద్రముగా పెట్టుకొని జీవించేవాడు విశ్వమును ప్రేమించలేడు. విశ్వ క్షేమము కోసం తన అహంకారాన్ని త్యాగం చేసేవాడే నిజమైన భక్తుడు.**

కూడా అంతే నిజం. ఈ శరీరం నిజం అనుకుంటున్నావా? అబద్ధం అనుకుంటున్నావా? నిజమే అనుకుంటున్నావు. అది నిజమో, అబద్ధమో తెలియదు. ఈ శరీరం నేను, ఇది నిజం, ఇది పుట్టినప్పుడు నేను పుడుతున్నాను అని నువ్వు అనుకుంటున్నావా, లేదా? అనుకుంటున్నావు. నువ్వు అనుకునే మాట ఎంత నిజమో, ఆ కొండ దేవుడు అనేది కూడా అంతే నిజం" అన్నారు. భగవాన్‌కి అరువు బేరం అంటే ఇష్టం ఉండదు. రాజీ బేరం అంటే ఇష్టముండదు. సత్యం దగ్గరకి రమ్మంటున్నాడు. ఒకవేళ నువ్వు రావు అనుకో, ఎక్కడికో పోతావు అనుకో, పక్షి ఎగురుతూ ఉంటుంది, ఎగురుతూ ఉంటుంది. ఎంతసేపు ఎగురుతుంది? ఎప్పటికైనా గూటికి రావాల్సిందే. నువ్వు ఎన్ని లోకాలలో తిరిగినా, ఎన్ని దేహాలలో తిరిగినా, ఎన్ని జన్మలు తిరిగినా, నీ మనస్సులో వచ్చే తలంపుల తోటి, నీ మనస్సులో వచ్చే ఊహల తోటి ప్రయాణం చేసినా, ఎక్కడకి వెళ్ళినా నువ్వు చివరకి హృదయంలోనికి రావాల్సిందే. పక్షి ఎంతో బాగా ఎగురుతుంది. ఎంతసేపు ఎగురుతుంది? అది భూమి మీదకి రావాల్సిందే, అదే విధంగా నువ్వు ఎప్పటికైనా ఆత్మను తెలుసుకోవాల్సిందే. నీ స్వరూపం తెలుసుకోవల్సిందే. కేవలం మనకి సందేశం ఇచ్చి, మనం ఎవరో మనకి తెలియజెప్పటం కోసం, ఈ జ్ఞానామృతాన్ని మనకి పంచిపెట్టటం కోసం ఆ లోకం నుండి ఈ లోకంలోకి వచ్చిన సుబ్రహ్మణ్యుడే రమణస్వామి. అంతేకాదు సాధన పేరు మీద జీవులు హింస పడిపోతున్నారు. దేవుడిని తెలుసుకోవాలి అని సాధన పేరు మీద హింస పడిపోతున్నారు. సాధన పేరు మీద ఈ జీవుడు పడుతున్న బాధను తగ్గించటం కోసం వచ్చిన అవతారమే రమణమహర్షి.

మీకు వెంకటేశ్వర స్వామి అంటే ఇష్టమేనా? శనివారం వెంకటేశ్వర స్వామి పుచ్చుకున్నాడు. సోమవారం శివుడు పుచ్చేసుకున్నాడు. శుక్రవారం లక్ష్మీదేవి, ఒక్కొక్క దేవుడు ఒక్కొక్క రోజు పుచ్చేసుకున్నారు. వెంకటేశ్వర స్వామి ఇష్టమైన వాళ్ళు అందరూ శనివారాలు చేస్తారు. మంచిదే అలా చేయండి. సోదరమహాశయులారా! ఇక్కడ మా భగవాన్ చెప్పేది ఏమిటంటే మీరు వెంకటేశ్వర స్వామిని ధ్యానం చేసేటప్పుడు, మీ కోరికను ధ్యానం చేస్తున్నారా? వెంకటేశ్వర స్వామిని చేస్తున్నారా? ఆలోచించండి. భగవంతుడు మీకు మేధస్సు ఇచ్చాడు. మీరు అందరూ ఆలోచించండి. మీరు వెంకటేశ్వర స్వామిని ధ్యానం చేస్తుంటే మీకు జ్ఞాపకం వచ్చేది మీ కోరికా? మీ కోరికను ధ్యానం చేస్తున్నారా? దేవుడిని ధ్యానం చేస్తున్నారా? ధ్యాస ఉంటే ధ్యానం కలుగుతుంది. కాని ధ్యాస వెంకటేశ్వర స్వామి మీద ఉందా? మీ

కోరిక మీద ఉందా? ఇది నిజమా? అబద్ధమా? సోదరమహాశయులారా! మనమందరం భక్తులం, కానీ మనం చేసేది లోక విచారణ. రాముడు అయోధ్య నుంచి బయలుదేరాడు. అయోధ్య విడిచి పెట్టేసి అరణ్యానికి వచ్చేశాడు. మంచిదే అది మంచిదే. రైటే, అది లోక విచారణా, ఆత్మ విచారణా? లోక విచారణ చేసి ఆత్మ ఎవడైనా తెలుసుకున్నాడా ఇప్పటివరకు? మహాత్ముల కథలు చెప్పకుంటున్నాం మంచిదే. మనకున్న కొన్ని దేహ సంస్కారాలు తొలగించటం కోసం అవతార పురుషుల చరిత్ర తెలుసుకోవటం మంచిదే. ఆత్మ విచారణ చేస్తే ఆత్మ తెలుస్తుందా? లోక విచారణ చేసేవాడికి ఆత్మ తెలుస్తుందా? లోకంలో ఆత్మ దొరుకుతుందా? మీ హృదయంలో దొరుకుతుందా? మనం ఆత్మ కోసం ఎక్కడ వెతుకుతున్నాం? శాస్త్రంలో వెతుకుతున్నాం. ఆత్మ శాస్త్రంలో లేదు. నీ హృదయంలో ఉంది. నీ హృదయంలో ఉన్న వస్తువును గురించి చెప్పటానికే ఆ లోకం నుండి ఈ లోకంలోకి వచ్చాడు రమణమహర్షి. శాస్త్రంలో ఆత్మ లేదు. మరి శాస్త్రం యొక్క ప్రయోజనం ఏమిటి? శాస్త్రం ఆత్మకు దారి చూపిస్తుంది కాని ఆత్మ అందులో లేదు. మరి ఆత్మ ఎక్కడ ఉంది? నీలో ఉంది, నీలో ఉన్న ఆత్మను శాస్త్రంలో వెతుకుతావు ఏమిటి? ఈ విషయం చెప్పటం కోసం, లోకాన్ని నిజం వైపు మళ్లించటం కోసం రమణస్వామి అవతరించారు. నేను ఏవో నాలుగు ఉపన్యాసాలు చెబుతాను, మీరు అందరూ నాకు గౌరవాలు చేస్తారు, సన్మానాలు చేస్తారు, మీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. ఏమిటి ప్రయోజనం?

మన భక్తి ఎలా ఉందో రామకృష్ణ పరమహంస చక్కటి ఉదాహరణ చెప్పాడు. దేవుడు కనిపించి భక్తుడికి, ఏమయ్యా నీకు ఏమి కావాలి అంటే వాడు మోక్షాన్ని కోరడు భీమవరంలో సత్రం కట్టించాలి అని ఉంది అంటాడు. అసలు వీడి గమ్యం ఏమిటో తెలియదు, వీడు భక్తుడు ఏమిటండి? మంచి పనులు చేయండి మంచిదే. మంచి, చెడు అనేవి మనసు యొక్క పరిధిలో ఉన్నవి, అది దాటితే ఏమీ లేదు. అది దాటితే ఉన్నది ఒక్కటే, మీరు సాధించటం విషయం తరువాత ఆలోచిద్దాం, అసలు మీ గమ్యం ఏమిటి? పూజ చేస్తున్నారు, జపం చేస్తున్నారు, ధ్యానం చేస్తున్నారు, యాత్రలకి వెళుతున్నారు, సత్సంగాలు చేస్తున్నారు, శ్రవణం చేస్తున్నారు, మననం చేస్తున్నారు, వీటి అన్నింటి యొక్క గమ్యం దేని కోసం మీరు పోరాడుతున్నారు? అసలు గమ్యం ఏమిటి? ఎక్కడకు చేస్తున్నాం మనం ప్రయాణం? మీరు అందరూ నూటికి నూరు పాళ్ళు సుఖంగా ఉన్నారు అనుకోండి, మీకు దేవుడి తోటి పని ఏముంది అసలు? కష్టం రాకూడదు, కష్టం రాకూడదు అనిప్రార్థించే భక్తులే కాని

కష్టం వస్తే సహించే శక్తిని ఇమ్మని ప్రార్థించేవాళ్ళే లేరు. గురువు గురువు అంటే ఏవండీ నేను మీకు మాటలు చెబుతున్నాను. మీరు వింటున్నారు. మరి నేను గురువా? నేను గురువు కాదు. గురువు శబ్దం ఎవరికి వర్తిస్తుంది అంటే నిజాన్ని చూసినవాడు గురువు. మీ దగ్గర నుంచి ఏదో ఒకటి పొందుదామని నేను కనిపెట్టుకుంటే నేను మీకు గురువు ఎలా అవుతాను? గురువు అనేవాడుఇవ్వాలా? పుచ్చుకోవాలా? మీరు అవమానాలు చేస్తే భరించే శక్తి ఈ గురువుకు లేదు. మీరు చేసే బహుమానాలు, మీ దగ్గర ఏదో పొందుదాం అని చూసేవాడిని నేను మిమ్మల్నిఏమి ఉద్ధరిస్తాను? మీ దగ్గర నుంచి ఏదో ఒకటి ఆశిస్తున్నాను అనుకోండి, నేను మీ గురువు ఎలా అవుతాను? మిమ్మల్ని ఎలా బాగు చేయగలను? మీకు నిజం చెప్పటానికి ప్రయత్నం చెయ్యాలా? నేను ఎలా చెబితే మీరు సంతోషిస్తారో అలా చెప్పాలా? మీ దగ్గర నుంచి ఏమైనా ఆశిస్తూ ఉంటే, మీరు ఎలా చెబితే సంతోషిస్తారో అలా చెప్పటానికి నేను ప్రయత్నిస్తాను. ఎందుచేత అంటే నేను అలా చెబితేనే కాని మీరు నాకు ఏమి బహుమానం ఇవ్వరు. అబద్ధాలు అయినప్పటికీ మీకు సంతోషం కలిగించే మాటలు చెబితే మీరు నాకు బహుమానం ఇస్తారు. మీరు పాడైపోతే నాకు ఎందుకు? మీ దగ్గర నుంచి పొందేది నాకు కావాలి.

గురుబ్రహ్మ గురువిష్ణు అంటే ఏమిటి? ఆత్మని దర్శించినవాడు గురువు, సత్యాన్ని తెలుసుకున్న వాడు గురువు, సత్యం అయినవాడు గురువు, వాడు బ్రహ్మ తోటి సమానం, వాడు విష్ణువు తోటి సమానం, వాడు శంకరుడితోటి సమానం. అసలు మీరు ఎండలో ఉంటే నీడకి రమ్మని చెప్పే చిత్తస్వభావం కూడా లేదు మేము గురువులమా? మీ అహంకారం తగ్గే మాటలు నేను చెప్పాలా? మీ గర్వం తగ్గే మాటలు నేను చెప్పాలా? ఈ స్వార్థం తగ్గే మాటలు నేను చెప్పాలా? లేక మీకు అహంకారం పెరిగే మాటలు, స్వార్థం పెరిగే మాటలు, గర్వం పెరిగే మాటలు చెప్తుంటే అది బోధా? లేకపోతే బాధ? నేను చెప్పే మాటల వల్ల మీ అహంకారం పలచబడాలా లేకపోతే చిక్కబడాలా? నేను చెప్పే మాటల వల్ల మీ దుఃఖం కొంతవరకు తగ్గాలా? లేకపోతే దుఃఖం పెరగాలా? లోకం అంతా శాస్త్రంలో ఆత్మ వెతుకుతోంది కానీ ఆత్మ మానవుని హృదయంలో ఉంది. అందుచేత మీలోనే వెతుక్కోండి. శాస్త్రంలో ఆత్మ లేదుఅని చెప్పటం కోసం, ప్రయత్నం చేసి మీరు ఎవరో మీరు తెలుసుకోవటం కోసం, అది చెప్పటం కోసమే వచ్చినటువంటి స్వామి రమణమహర్షి.

సోదరమహాశయులారా! కృష్ణుడు భక్తి యోగం చెప్పాడు, కర్మ యోగం చెప్పాడు, జ్ఞాన యోగం చెప్పాడు, ధ్యాన యోగం చెప్పాడు, ఎందుకు ఇన్ని యోగాలు చెప్పాడు? ఒక్క యోగం చెబితే సరిపోతుంది కదా అని అడుగుతున్నారు. మీ మనస్సు వేరు, నా మనస్సు వేరు, వాడి మనస్సు వేరు. ఎన్ని మనస్సులు ఉంటే అన్ని యోగాలు, ఒక్కొక్క మనిషికి mental మేకప్ ఒక్కొక్క రకంగా ఉంటుంది. వస్తువు ఒక్కటే. రమణమహర్షిగారి గురించి చాలామంది ఉపన్యాసాలు చెబుతారు. రమణమహర్షిగారు చాలా యోగాభ్యాసాలు చేశారు. ఆ కొండ గుహలో కూర్చున్నారు యోగం చేశారు. యోగం అంటే ఏమిటి? కలయిక. ఎవరి తోటి కలయిక? పరమాత్మ తోటి కలయిక. రమణమహర్షి గారిని అడిగారు. ఏవండీ మీరు యోగాభ్యాసాలు ఎంతకాలం చేశారు? నాకు వియోగం ఎక్కడుంది అన్నారు. నేను జీవుడిని అనుకున్నప్పుడు దేవుడిని తెలుసుకోవటానికి నాకు యోగం అవసరం. నాకు వియోగం ఎక్కడ ఉంది?

మనకి ఎవరైనా నమస్కారం పెట్టకపోతే కోపం వస్తుంది. ఏదో గౌరవం కోసం ఒకసారి అలా పెడితే ఊరుకునే వారు . అది చాదస్తంగా పెడితే భగవాన్ “ఈ శవం ముందు ఆ శవం ఎన్ని సార్లు పడేస్తావు” అనేవారు. ఈ శరీరం ఒక శవం. ఈ శవం ముందు ఆ శవాన్ని ఎన్ని సార్లు పడేస్తావు? నీ శరీర వ్యాయామాల వల్ల, ఈ కూర్చోటాలు, నుంచోటాలు వల్ల భగవంతుడు మోసపోడు. భగవంతుడు మీ మనస్సు ఎలా ఉందో చూస్తాడు. మీ అహంకారం పలచబడిందో, లేదో చూస్తాడు. మీకున్న దైవీసంపద ఏమిటో చూస్తాడు. ఎంతవరకు పక్వానికి వచ్చావో చూస్తాడు. మీ దండాలకి, మీ నుంచోటాలకి, కూర్చోటాలకు ఆయన మోసపోడు. దేవుడిని మోసం చేయగలరా మీరు?

రమణమహర్షి గారిని అడిగారు సిద్ధులు ఉన్నాయా అని, సిద్ధులు ఏమిటయ్యా ఆత్మే సిద్ధి. ఆత్మ నిజం అని చెప్పలేదు రమణమహర్షి, ఆత్మ ఒక్కటే నిజం. అయితే సిద్ధులు లేవా? ఈ మహిమలు లేవా? అంటే ఉన్నాయి. అవన్నీ ఎంతవరకు నిజం అంటే మనకు కలలో కనబడే వస్తువులు ఎంతవరకు నిజమో, అది అంతే నిజం. కలలో మేడలు కనిపిస్తాయి. కలలో మనకి భోగాలు అనుభవించినట్టు కనిపిస్తుంది. ఇవన్ని స్వప్నాలలో మనం అనుభవిస్తున్నాం, ఆ స్వప్నంలో అనుభవించే భోగాలు ఎటువంటివో, ఈ సిద్దులు కూడా అటువంటివే అన్నారు. ఇవన్నీ మానసికం అన్నారు. మనసు దాటితే ఇవి లేవు అన్నారు. ఉన్న సిద్ధి ఒక్కటే, ఉన్నది నిజం ఒక్కటే, అది ఆత్మ. దానిని పొందినవాడు సిద్ధి పొందుతాడు.

మిగతావి లేవా? ఉన్నాయి. అవి ఎటువంటివి అంటే స్వప్నం తోటి సమానం. ఈశ్వరుడు జీవులను వారివారి ప్రారబ్ధాలను అనుసరించి ఆడిస్తున్నాడు. జరగ వలసింది జరిగే తీరును. జరుగరానిది ఎవడు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరగదు. ఇది తెలుసుకో, జరిగేది ఈశ్వర సంకల్పమే, నీ సంకల్పం కాదు. నువ్వు అనుకున్నా, అనుకోక పోయినా జరిగేది ఈశ్వర సంకల్పమే. రమణమహర్షి వాళ్ళ తల్లి గారికి చెప్పిన సందేశం ఇది. ఈ వాక్యం కనుక మనకి అర్థం అయితే దుఃఖం పుట్టనే పుట్టదు. జరిగేది అంతా ఈశ్వర సంకల్పమే అనే వాక్యం మన గుండెకు హత్తుకోవాలి, మన హృదయంలోకి దిగాలి. మన రక్తంలో రక్తంగా మాంసంలో మాంసంగా ఆ వాక్యం మనకి జీర్ణం అవ్వాలి. ఇంక ఆ మనిషికి దుఃఖం పుట్టనే పుట్టదు.

మీ వారసులు పొలాలు పంచుకుంటున్నారు, రూపాయలు పంచుకుంటున్నారు. మీ దుఃఖాన్ని ఎవరైనా పంచుకుంటున్నారా మీ వారసులు? మీ దుఃఖాన్ని ఎవడైతే పంచుకుంటున్నాడో వాడే మీ గురువు. తోటి మానవుడి యొక్క దుఃఖాన్ని ఎవడైతే పంచుకుంటున్నాడో వాడే మహాత్ముడు. దేవుడు పుట్టడు పుట్టినవాడువలే కనిపిస్తాడు. మనకి ఎంతసేపు కనిపించటాలే కావాలి. ఎప్పుడు చూసినా ఒక వస్తువు గురించేనా, ఎప్పుడు చూసినా ఆత్మ గురించేనా చెప్పటం స్వామి అని అడిగితే, మీరు ఏదో సంతోషిస్తారు అని నేను అబద్ధాలు కల్పించి ఎక్కడ చెప్పగలను? ఉన్నది ఒక్కటే, దాని గురించి చెబుతున్నాను. మీకు ఇష్టం లేదని మీకోసం నేను అబద్ధాలు ఎక్కడ కల్పించగలను? ఆయన గురువు. వాడు ఎటువంటివాడు అయినప్పటికి ఆత్మను తెలుసుకునే వరకు వాడు సిద్ధుడు కాదు సాధకుడే. మీరు అవ్వనివ్వండి, నేను అవ్వనివ్వండి, ఇంకొకడు అవ్వనివ్వండి, ఎవరైనా సరే ఆత్మను తెలుసుకునే వరకు వాడు సిద్ధుడు కాదు. వాడు సాధకుడు. వాడు ఎంతటి వాడు అయినా సరే, ఎంత ఉన్నత విద్యావంతుడు అయినా సరే!

భగవాన్ దగ్గర కొంతమంది బీదవాళ్ళు ఏమన్నారు అంటే స్వామి, ఏదో ఒకటి కొనుక్కొని తేవాలి అని మాకు అనిపించింది కాని డబ్బులు లేవు అన్నారట. అలా అనకండి, మీరు ఏమి తేలేదు అంటారేంటి తెచ్చారు. నేను నేను అంటున్నారు కదా ఆ నేనుని తెచ్చారు కదా, నాకు కావాల్సింది అదే. ఈ నేను నేను అంటున్నాను చూశారు, ఈ దుఃఖాన్ని తీసుకు వచ్చే నేను, ఈ నరకాన్ని తీసుకు వచ్చే నేను, జన్మ పరంపరలలో తిప్పే నేను, చీకట్లో ముంచే నేను, అజ్ఞానంలో ముంచే నేను, ఆ నేనుని తినటానికే నేను వచ్చాను. అరటిపళ్ళు తినడానికి కాదు. ఆ నేనుని

తెచ్చావు కదా నువ్వు ఏది తేవాలో అది తెచ్చావు.  నాకు కావాల్సింది ఆ నేను, వాడు ఋషి అంటే.  భగవాన్ ఏమి అన్నారు అంటే గుళ్ళో ఉన్న దేవుడు నాకంటే అదృష్టవంతుడు.  ఎందుకంటే ఆయనకి పళ్ళు చూపించి పట్టుకుపోతున్నారు.  నా విషయంలో అలా కాదు నన్ను తినమంటున్నారు.  స్వామి మీ విగ్రహం చేయిస్తున్నారు అని భగవాన్‌తో కొంతమంది భక్తులు అంటే అప్పుడు భగవాన్ అన్నారట, ఆయన మీద ఆయన జోకు చూడండి.  అవును మరి రాతి మనుషులకి రాతి దేవుళ్ళు ఉండాలి.  వాడు రమణమహర్షి.  అంటే ఆ దేవుడిని పూజించకూడదు అని కాదు రాతి మనుషులకి సజీవంగా ఉన్న మానవుల కంటే రాతి దేవుళ్ళు అంటే ఇష్టం. భగవాన్ దగ్గరకు వెళ్ళి చాలామంది మీ దర్శనానికి వచ్చామండి స్వామి అనేవారు.  మీరొచ్చి నా దర్శనం చేసుకోవడం ఏమిటి?  నేను ఇక్కడే ఉన్నాను, మీరు ఎక్కడ నుంచో కష్టపడి వస్తున్నారు, నాకు దర్శనం ఇస్తున్నారు.  ఆయన రమణమహర్షి అంటే!

ఒకసారి సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పాడు.  మీరు రమణమహర్షి గారిని పూర్వపు మహా పురుషులలో ఎవరితో అయినా పోల్చాలి అని మీరు సరదా పడితే, ఒక్క సుఖమహర్షి తప్పించి ఈయనతో పోల్చదగిన వాళ్ళు ఎవరు లేరు అన్నారు.  ఇది రాధాకృష్ణన్ చెప్పిన మాట.  ఇది బ్రహ్మము అని తెలియదు, ఆత్మ అని తెలియదు, దేవుడని తెలియదు, ఏమి తెలియకుండా, భక్తులు, యోగులు దేనిని తెలుసుకోవడం కోసం ప్రయత్నం చేస్తున్నారో, ఏ వస్తువును తెలుసుకోవడం కోసం మానవుడు ప్రయత్నం చేస్తున్నాడో, ఆ వస్తువును తనకి తెలియకుండా తాను పొందాడు వాడు రమణమహర్షి.  అసలు బ్రహ్మ పదార్థం అనేది ఒకటి ఉందని కనీసం ఎప్పుడు చెవుల తోటి వినకుండా, పుస్తకంలో చదవకుండా, బ్రహ్మ పదార్థం పొందిన వాడు, వాడు రమణమహర్షి.  ఈ కలియుగంలో ఎవడికి ఈ అనుభవం కలిగింది?  పదహారో సంవత్సరంలో అతడు జ్ఞాని అయ్యాడు.  ఆత్మ సామ్రాజ్యానికి, మోక్ష సామ్రాజ్యానికి, కొన్ని సెకన్ల కాలంలో చక్రవర్తి అయిపోయాడు.  సోదరమహాశయులారా! ఒక మనిషి యొక్క స్వభావం మారాలి అంటే వాడి స్వరూపం తెలిస్తేనే కాని స్వభావం మారదు.  నిగ్రహఃకింకరిష్యతిఅని భగవంతుడు వాసుదేవస్వామి కూడా గీతలో చెప్పాడు.

**మన మనస్సుని మనం స్వాధీనం చేసుకోవటానికి మన తెలివితేటలు ఒక్కటే సరిపోవు.  మన ప్రయత్నం ఒక్కటే సరిపోదు.  ఈశ్వర అనుగ్రహం కూడా ఉండాలి.**



# గిరి ప్రదక్షిణ

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)**

అరుణాచలంలో పరమేశ్వరుడు మూడు రూపాలలో ఉన్నాడని చెపుతారు - గిరి రూపం, లింగ రూపం, సిద్ధ రూపం. గిరి రూపం మొదటిది, ముఖ్యమైనది. పూర్వం ఈశ్వరుడు జ్యోతి స్థంభ రూపంలో మహావిష్ణువుకి బ్రహ్మదేవుడికి ఇక్కడ దర్శనం ఇచ్చాడు కాబట్టి దానికి గుర్తుగా ఇక్కడ దీపం వెలిగిస్తారు. కాశీలో గంగానదిలో స్నానం చేయటం, విశ్వేశ్వరుడిని దర్శించటం ఎంత ప్రాముఖ్యమో, అరుణాచలంలో గిరిని దర్శించటం, గిరి ప్రదక్షిణ చేయటం అంత ముఖ్యం.

ప్రదక్షిణ చేయటానికి ఇక్కడ షరతులు ఏమిటంటే, కాళ్ళకి చెప్పలు ఉండకూడదు, నెత్తిమీద గొడుగు ఉండకూడదు. గిరి ప్రదక్షిణ చేసేటప్పుడు రోడ్డుకి ఎడమపక్కనుంచి వెళ్ళటం మంచిదని పెద్దలు చెపుతారు. దేవతలు సిద్ధపురుషులు కుడిపక్కనుంచి ప్రదక్షిణ చేస్తారు కాబట్టి వాళ్లకి అడ్డం రాకుండా వెళ్ళమని సాంప్రదాయంలో చెపుతారు. ప్రదక్షిణ సాంప్రదాయం ఏమిటంటే, కాళ్ళు నడుస్తూ ఉండాలి, నోరు మాట్లాడకూడదు. విషయచింతన చేయకుండా, ఈశ్వరుడిని చింతిస్తూ, కొండని ధ్యానం చేసుకొంటూ, మౌనంగా నెమ్మదిగా నడవాలి. రేపో ఎల్లుండో పురుడు వచ్చే అమ్మాయి ఎంత నెమ్మదిగా నడుస్తుందో, అంత నెమ్మదిగా నిదానంగా నడవటం మంచిది అనిపురాణాలలో చెప్పారు. లోకానికి సంబంధించిన మాటలు చెప్పకోకూడదు. మీకు కావాలంటే అక్షరమణమాల పారాయణం చేసుకోవచ్చు, కాని అది కూడా రెండో పక్షం.

**ప్ర-ద-క్షి-ణం - దీనికి పురాణాలలో వివరణ చెప్పారు -**

**'ప్ర'** అంటే పాపాలు పోతాయి అని. మనకి ఏవో దోషాలు, పాపాలు, బలహీనతలు లేకపోతే ఈ శరీరం రాదు. నూటికి నూరుపాళ్ళు ఆనందస్థితి, జ్ఞానం పొందిన వాడికి పునర్జన్మ రాదు. మనకి ఏవో దోషాలు ఉన్నాయి కాబట్టి శరీరం వచ్చింది. సాధన చేసి, మన మనస్సులో ఉన్న దోషాలని, ఆటంకాలని, బలహీనతలని పోగొట్టుకోవాలి. మనకి ఏదైనా అనారోగ్యం వస్తే ఆసుపత్రికెళ్ళి వైద్యం చేయించుకొని ఎలా పోగొట్టుకొంటున్నామో, అలా సాధన చేసి మన బలహీనతలని పోగొట్టుకోవాలి. జ్ఞానం సంపాదించటం అంటే కొత్తగా ఏమీ రాదు, మీకున్న అజ్ఞానాన్ని అవిద్యని పోగొట్టుకోవటమే జ్ఞానం సంపాదించటం అన్నారు భగవాన్. మీరు ఆరోగ్యం సంపాదించుకోండి అంటే అర్థం మీకున్న అనారోగ్యాన్ని పోగొట్టుకోవటమే ఆరోగ్యం సంపాదించటం.

'ప్ర' అంటే పాపాలని పోగొట్టే కొండ. ఏ దోషము లేకుండా అసలు శరీరం రాదు. చాలామంది మాకు అహంకారం లేదు అనుకుంటారు, వాళ్ళని వాళ్ళు మోసం చేసుకోవటం అది. ఏదైనా పని చేస్తుంటే, నేను ఫలానా దేహాన్ని అనుకునే చేస్తున్నావు కదా, అది అహంకారమే! అందుచేత అహంకారం లేదని అనుకోకండి. అసలు మాటే అహంకారం. మీకు అహంకారం లేకపోతే మాట ఎందుకు వస్తోంది? నేను చెప్పింది మీరు నమ్మక్కరలేదు. మీరు చూసుకోండి - అవసరం ఉండి మనం నాలుగు మాటలు మాట్లాడితే, గొప్పల కోసం అహంకారం కోసం 96 మాటలు మాట్లాడతాం. అసలు మీ శరీరమే అహంకారం, అహంకారం లేకపోతే మీకు శరీరం ఎందుకు వస్తుంది? నీకు స్టోరులో పుణ్య కర్మో పాప కర్మో లేకపోతే నువ్వేమి చేసుకుంటావు శరీరాన్ని? శరీరమే అహంకారం, మనస్సు అహంకారం, మాట అహంకారం, చూపు అహంకారం, చేత అహంకారం, ప్రతిదీ అహంకారమే! అహంకారం ఉన్నంతసేపు మమకారం లేకుండా ఏ మనిషీ ఉండలేడు. నేను అనేది ఎప్పుడైతే వచ్చిందో, అప్పుడు నాది అనేది కూడా వచ్చి తీరుతుంది. 'ప్ర' అంటే పూర్వజన్మల నుంచీ మీరు మోసుకొస్తున్న పాపాలు పోగొడుతుంది. అంటే ఒకేసారి పోతాయి అనుకోకండి. ఒకో పాపానికి ఒకో పాపానికి నిప్పు పెడతాడు అరుణాచలేశ్వరుడు. మనం ఏదైనా పుల్ల వెలిగిస్తే అది వెంటనే కాలి బూడిద అయిపోదు, కొంత సమయం పడుతుంది. మీరు ప్రదక్షిణ ప్రారంభిస్తే మీ పాపాలకి నిప్పు పెడతాడు, అవి కాలటానికి కొంత టైము పడుతుంది.

**'ద'** అంటే మీరు అడిగినవి ఇస్తూ ఉంటాడు. మీకు ఏవో కోరికలు ఉంటాయి కదా. ఆయన గివర్ అన్నమాట. భగవాన్ చెపుతారు కదా, 'అడుగకిచ్చెడు నీదు అకళంకమగు కీర్తి హాని సేయక బ్రోవుము అరుణాచలా!' పురాణాలలో ఏముందంటే, కొంతమంది దేవతలు అడిగించుకొని ఇస్తారు. అరుణాచలేశ్వరుడు ఎవరిచేత అడిగించుకోకుండా వాళ్ళ అవసరాలు ఏంటో చూసుకొని ఇస్తాడు. మీ అవసరాలు ఏంటో మీకంటే బాగా ఆయనకు తెలుసు. 'ద'-అడిగింది ఇస్తాడు. అంటే అవసరాన్ని బట్టి ఇస్తాడు. ఎప్పుడు ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి ఆయన నిర్ణయించుకుంటాడు, ఆ ముహూర్తం ఆయన పెట్టుకుంటాడు. నాకు ఈరోజే ఇవ్వాలి అంటే ఇచ్చేయడు. నువ్వు కోరుకున్నది ఇస్తే పాడైపోతావు అని ఆయన అనుకొన్నప్పుడు ఇవ్వడు, దాని వలన నీ చెడ్డ అలవాటు పెరిగిపోతుంది, నువ్వు పాడైపోతావు అని ఆయనకి తెలుసు. నీ బుద్ధి కుదుటపడ్డాక నీ మనస్సు నిర్మలం అయ్యాక, నీకేదైనా నాలుగు రూపాయలు ఇస్తే పదిమందికీ ఉపయోగపడతావు అనుకున్నప్పుడు ఇస్తాడు, లేకపోతే ఆపుచేసేస్తాడు. నీ బుద్ధిలో వంకరలు పెట్టుకొని, ఐశ్వర్యం ఇచ్చెయ్యి, అంటే

ఇచ్చేయడు. నీకు పేకాట అలవాటు ఉండగా నీకు డబ్బిస్తే నువ్వు పాడైపోతావు. ఇతరులని కూడా పాడు చేస్తావు. ఆ పేకాట అలవాటు నీతో మాన్పించి అప్పుడు డబ్బు ఇస్తాడు. 'ద' అంటే ఇస్తాడు, ఆ ఇచ్చేది సైలెంటుగా ఇస్తాడు. ఆయన ఏ పని చేసినా సైలెంటుగా చేస్తాడు, సీక్రెట్ గా చేస్తాడు. అరుణాచలేశ్వరుడి వల్ల నాకీ ఉపకారం జరుగుతోంది అని నీకు కూడా తెలియనివ్వడు. వాడు అరుణాచలేశ్వరుడు!

**'క్షి'** అంటే క్షీణించటం. మనకి తెలియకుండా మనలో బలహీనతలు ఉంటాయి. అవి ఉన్నట్టు మనకి కూడా తెలియదు. అవి గత జన్మలలో నుంచి వస్తాయి. అంటే మన పూర్వ శరీరం కాలి బూడిద అయినా, పుష్పంలో నుంచి గాలి ఏవిధంగా అయితే వాసనని మోసుకోస్తుందో, అలాగే మీ శరీరం చనిపోయిన తరువాత మన బలహీనతలని రాబోయే శరీరంలో వర్క్ అవుట్ చెయ్యటం కోసం, పుణ్యం ఉంటే పుణ్యం, పాపం ఉంటే పాపం, కొత్త శరీరంలోకి మోసుకోచ్చేస్తాడు. 'క్షి' అంటే క్షీణింప చేయటం. నీకు తెలియకుండా నీలో చాలా దోషాలు ఉంటాయి. అయితే ఆ దోషాలని నువ్వు ఇతరులకి కనపడకుండా పౌడర్ రాసేసుకొని ముస్తాబై వచ్చేస్తారు. అదీ మనం చేసే సాధన! మనం ఎన్ని పౌడరులు స్నోలు రాసేసినా, అరుణాచలేశ్వరుడు అంతర్యామి. ఆయన సర్వజ్ఞుడు, సర్వసాక్షి. మనం ఎన్ని కుప్పిగంతులు వేసినా, మన బలహీనతలు ఏంటో ఆయన చూస్తా ఉంటాడు. వాటిని 'క్షి' చేస్తాడు, అంటే క్షీణింప చేయటం మొదలుపెడతాడు. అంటే వాటిని తగ్గించటానికి ప్రయత్నం చేస్తాడు.

**'ణం'** అంటే మోక్షం ఇస్తాడు. అయితే నీ బలహీనతలని తొలిగించకుండా, ఆత్మజ్ఞాన సముపార్జనకి నీ లోపల ఉన్న ఆటంకాలని బయటికి లాగి కాల్చి బూడిద చెయ్యకుండా, నీకు ఆత్మజ్ఞానం ఆయన కూడా ఇవ్వలేడు. ఇవన్నీ అయిన తరువాత 'ణ' - అప్పుడు మోక్షం ఇస్తాడు. తమిళ సాహిత్యంలో సాంప్రదాయం ప్రకారం ప్రదక్షిణానికి ఇలా అర్థం చెపుతారు.

పూర్వం పెద్దలు అందరూ ఇక్కడ ప్రదక్షిణం చేసినవాళ్లే. రమణ స్వామే అరుణాచలేశ్వరుడు అయినప్పుడు ఆయనకి ప్రదక్షిణం ఎందుకు అంటే మనకి అలవాటు చెయ్యటానికి. మనకి ఐడియల్ కోసం. కృష్ణుడు చాలా కష్టపడి పని చేసాడు. గీతలో అన్నాడు - నేను కష్టపడి పని చేసి ఈ సృష్టిలో సంపాదించవలసినది అంటూ ఏమీ లేదు. అయినా కష్టపడి పని చేస్తున్నాను, భగవంతుడికి కొరత ఏముంది, అన్నీ ఆయనే కదా. భగవంతుడే పని చెయ్యకపోతే అందరూ సోమరిపోతులుగా తయారు అవుతారని, జీవకోటికోసం పని చేస్తున్నాను అన్నాడు.

# నారాయణం పరఃబ్రహ్మం సర్వ కారణ కారణం

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)**

నారాయణం పరఃబ్రహ్మం సర్వ కారణ కారణం - ఈ వాక్యం రోజూ అనుకుంటే మీకు కర్తృత్వం తగ్గిపోతుంది అహంభావన తగ్గిపోతుంది. కర్తని వెదికితే కర్తృత్వం పోతుంది, అది విచారణ మార్గం. ఈ వాక్యం జ్ఞాపకం పెట్టుకున్నా మీకు కర్తృత్వం పోతుంది.


నారాయణం పరఃబ్రహ్మం - నారాయణుడు అంటే ఒక ఇండివిడ్యువల్ కాదు, వ్యక్తి కాదు. నారాయణుడు అంటే బ్రహ్మమే.

నారాయణం పరఃబ్రహ్మం సర్వ కారణ కారణం - అంటే అన్నిటికీ నారాయణుడే కారణం అని మీకు అర్థం అయినప్పుడు మీకు ఇంక కర్తృత్వం ఏమిటి! అన్నిటికీ నేనే కర్తను అనుకోవటం వల్ల మీకు దుఖం వస్తోంది. నేను కర్తకాదు, నారాయణుడే కర్త అనుకున్నప్పుడు మీకు దుఖం ఎక్కడినుంచి వస్తుంది! అయితే ఈ వాక్యాన్ని మీ మనస్సులో తిప్పకోవాలి. ఈ మాట రాసుకొని ప్రాక్టిస్ చేసుకోవాలి, మీరు పిండి రుబ్బేటప్పుడు ఎలా రుబ్బుతారో, అలా ఈ మాటని మీ మనస్సులో తిప్పకోవాలి. అలా తిప్పకుంటా ఉంటే మీమనస్సులోకి ఇంకుతుంది. ఊరికే వింటే సరిపోదు. ఆ మాట మీలో ఇంకాలి, అది మీకు అవగాహన లోకి రావాలి. అంటే మీ బుద్ధిలో ఒక భాగం అవ్వాలి అది. అప్పుడు కర్తృత్వం పలచబడి పోతుంది. అన్నిటికీ ఆయనే కారణం అన్నప్పుడు ఇంక మీకు కర్తృత్వం ఏమిటి!

**నారాయణం పరఃబ్రహ్మం సర్వ కారణ కారణం.**

**నారాయణా, నారాయణా! ఓం నమో నారాయణాయ!**

**వాసుదేవా, వాసుదేవా! ఓం నమో భగవతే వాసుదేవాయ!**



**బ్రహ్మానుభవం పొందిన వాడి శరీరం పడిపోయిన తరువాత కూడా ఆ శాంతి సముద్రం నుండి వచ్చిన కెరటాలు జీవకోటిని ముంచేస్తూ ఉంటాయి. అక్కడ శరీరంతోటి పని లేదు, శరీరం ఉన్నప్పుడు కూడా మిమ్మల్ని ప్రేమించేది శరీరం కాదు. ఏదైతే మిమ్మల్ని ప్రేమిస్తుందో అది శరీరం పడిపోయిన తరువాత కూడా ఉంటుంది.**

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# భగవాన్ శ్రీ రమణమహర్షి

తారీఖు ప్రకారం ది॥ 30-12-1879న తమిళనాడులోని తిరుచ్చుళి గ్రామంలో అళగమ్మ, సుందరం అయ్యరు పుణ్యదంపతుల ద్వితీయ సంతానముగా దేహము ధరించిన వేంకటరామన్, తరువాత కాలంలో అరుణాచల ఋషిగా, భగవాన్ శ్రీరమణ మహర్షిగా ప్రసిద్ధి చెందారు. భగవాన్ శ్రీరమణమహర్షి బోధామృతము విశ్వవ్యాప్తంగా నేటికీ జిజ్ఞాసువుల హృదయాలను అలరిస్తూనే ఉంది. విశిష్ఠ వ్యక్తులు భూమి మీద అరుదుగా అవతరిస్తూ ఉంటారు, అట్టివారే భగవాన్ శ్రీరమణమహర్షి. శ్రీరమణుని యొక్క అతినిరాడంబరమైన, ఆధ్యాత్మిక జీవితం అందరినీ ఆశ్చర్యపరచేది. ఆయన స్వేచ్ఛా ప్రియుడు, అందరితోటి ఆత్మసంబంధాన్ని, ప్రేమ సంబంధాన్ని, సేవా సంబంధాన్ని కలిగి యుండేవారు. అన్ని విద్యలలోకి శ్రేష్ఠమైనది 'ఆత్మవిద్య' అట్టి ఆత్మవిద్యను సూటియైన పద్ధతిలో మానవాళికి అందించారు. ఆయన సందేశం ఉపనిషత్తులసారమే! సత్యము గురించి మాట్లాడేవారు ఈ భూమి మీద చాలామంది ఉంటారు. కానీ సత్యమే తానై మాట్లాడేవారు కూడా అరుదు. అట్టి మూర్తీభవించిన జ్ఞానమే భగవాన్ శ్రీరమణమహర్షి. భగవాన్ శ్రీరమణుని తత్త్వబోధను అనేక సంవత్సరములుగా మనకు అందించి, అంతిమ సత్యంలోకి మేల్కొలిపిన, శ్రీరమణుని ప్రియశిష్యులు సద్గురువు శ్రీనాన్నగారికి మనము ఎంతో ఋణపడి ఉంటాం. భూమిమీద మానవునిగా జన్మించినందుకు అహంకార శృంఖలాలను ఛేదించి, స్వరూప అమృతస్థితిలోకి మేల్కొనుటకు ప్రతి ఒక్కరు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. మళ్ళీ మళ్ళీ ఈ అవకాశం రాదు. ఆధ్యాత్మిక పునరుజ్జీవన లేని భోగభాగ్యాల వల్ల ఏమీ ప్రయోజనం లేదు. మాంసపు బొమ్మలు రకరకాలుగా, వేరువేరుగా కనబడుచున్నా, అన్నిటిలో అందరిలో అంతర్యామిగా ఉన్న చైతన్యం ఒక్కటే! సమతాభావాన్ని అనగా సమత్వాన్ని సాధిస్తే అదే మోక్షం. మానవాళి ఆధ్యాత్మిక ప్రగతికి మహాత్ముల జీవిత విధానము, వారి బోధ, ఎంతగానో దోహదపడతాయి. పుట్టిన దేహము నీవు కాదు, పుట్టని బ్రహ్మమే నీవు. నేను అసలు పుట్టనేలేదు, దేహము నేను అను తలంపు వల్ల నేను పుట్టాను అని అనుకుంటున్నాము; కేవలం ఏ చైతన్యం అయితే ఉందో అదే నేనుగా ఉంది; అదే పరమసత్యం, తదితరమంతా సత్యము యొక్క ఆభాసే అన్నది వారి బోధాసారము. భగవాన్ శ్రీరమణమహర్షి అనుగ్రహస్వరూపుడు, కరుణాస్వరూపుడు, తేజోస్వరూపుడు, వారి ఉనికి నిరంతరం ప్రత్యక్షమే.

**(ది॥ 30-12-2022 శ్రీ రమణ జయంతి సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం అర్ధవరం గ్రామంలో వెలసిన దివ్యక్షేత్రాల సందర్శనం

**(గత సంచిక తరువాయి)**

మా అమ్మమ్మగారైన సయ్యపరాజు సీతమ్మగారు మహాజ్ఞాని. అరుణాచలంలో రమణాశ్రమంలో భోజనశాలలో శ్రీరమణ మహర్షి ఆమెను దగ్గరకు పిలిపించుకుని తన ప్రక్కన కూర్చోబెట్టుకొని ఆమె విస్తరిలో ఒక అన్నం ముద్ద పెట్టారు. మా అమ్మమ్మ గారు చివరి రోజుల్లో భగవాన్‌లాగే భుజంపైన కేన్సర్ పుండు వేసి బాధించినా ప్రశాంతంగా హాయిగా భరించి పరమపదించారు. శివాలయంలో రామశాస్త్రిగారు మా అమ్మమ్మ గారు మా ఇంటి వద్ద అరుగు మీద కూర్చుని సాయంకాలం 4 గంటలకు సత్సంగము జరిగేది. మా అమ్మమ్మగారిని రామశాస్త్రిగారు "బంగారు సీతమ్మ, ఎన్నికైన సీతమ్మ, జ్ఞాన సంపన్నురాలైన సీతమ్మ" అని కొనియాడేవారు. అప్పుడు నా వయస్సు 3 సంవత్సరాలు మాత్రమే. మా తోబుట్టువులు మా అమ్మగారు అందులో పాల్గొనేవారు.

మా గ్రామంలో బ్రాహ్మణ రామభక్తురాలు మాశమ్మగారు మహాజ్ఞాని. సహజ సమాధిలో ఉండేవారు. వారి ఇంటికి ఎదురుగా ఉన్న స్థలాన్ని చూపుతూ భవిష్యత్తులో ఇక్కడ రామాలయం నిర్మించబడుతుందని అన్నారు. దానికి అనుగుణంగా మా పిన తండ్రిగారైన చిన్నబుల్లి తాతరాజుగారు భద్రాచలం వెళితే నీ గ్రామంలో రామాలయం నిర్మించు అని స్వప్నంలో ఆదేశిస్తే నిర్లక్ష్యం చేస్తే రాములవారు వారి ఇంటి వద్ద గదిలో పూనకం పూని బలంగా ఇల్లు అదిరేలా చిందులు వేస్తే మా మండువాలోని వారు చూచి మీరు చెప్పినట్లే చేస్తామని, మన్నించమని తెలుపుగా శాంతించారు. చందాలు పోగుచేసి సుందరమైన ఆలయాన్ని నిర్మించారు. రోడ్డులు పెరగటం వల్ల ఆలయం పల్లం కావటంతో గ్రామస్తులు 70 లక్షలతో ఆలయ పునఃనిర్మాణానికి పూనుకున్నారు. మాసెమ్మగారు, రామశాస్త్రిగారు మా అమ్మమ్మగారు ముగ్గురు జ్ఞానులు అర్ధవరం గ్రామంలో సమకాలికులుగా ఉండటం ఆధ్యాత్మిక చరిత్రలో కనిపించటం చాలా అరుదు.

మా గ్రామంలో షిరిడీసాయిబాబా ఆలయాన్ని పమ్మి రామమూర్తి మాష్టారు సంతానం ఘనంగా నిర్మించారు. వారి సద్గురువులను హైదరాబాద్ నుండి కారులో తీసుకొని వస్తూ ఉండగా ఉదయం 5 గంటలకు నారాయణపురం గ్రామంలో ఏలూరు కాల్వలో స్నానం చేసి చెట్టుక్రింద నేలపై కొద్దిసేపు సేద తీర్చుకొని మా గ్రామంలోకి ఉదయం 7 గంటలకు వచ్చారు. ఆ స్వామి వైభవం మనవి చేస్తున్నాను షిరిడీ సాయిబాబా లాగే ఉడికే పులుసులో తన చేతిని పెట్టి తిప్పినట్లే వీరు కూడా తన చేతిని ఉడికే పులుసులో పెట్టి తిప్పతారు. ఇక్కడ సాయిబాబా ఆశ్రమానికి శంకుస్థాపన చేసారు. నా గురుదేవులు జిన్నూరు శ్రీనాన్నగారు షిరిడీ వెళితే రాత్రి స్వప్నంలో బంగారు రంగులో మెరిసిపోతున్న ఆంజనేయస్వామి దర్శనమిచ్చారు. శ్రీనాన్నగారు వారితో "నేను బాబా దర్శనానికి వస్తే మీరు దర్శనం ఇచ్చారు ఏమిటి?" అంటే "నా మూలవిరాట్ ఇదే నా ప్రతిరూపమే బాబా" అన్నారు. ఒంటిమెట్ట అలయానికి వెళితే రాములవారు దర్శనమిచ్చి సందేశమిచ్చారు. అలాగే వారు ఏ దేవాలయానికి వెళ్ళినా ఆ క్షేత్ర పాలకులు స్వప్న దర్శనమివ్వటం మామూలే ఫళని, తిరుచెందూర్ వగైరాలలో కూడా.

**(వచ్చే సంచికలో మిగిలిన విశేషాలు తెలుపుతాను) - సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**